S TV SAMAYAM

www.epapersamayam.com

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 18 | సంచిక: 323 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 3 ఆగస్టు 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## 46,85,838 మంది రైతులకు

# అన్నదాత సుఖీభవ

## దీనికోసం రూ.2,343 కోట్ల నిధుల్ని కేటాయించాం



- రైతలకు అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం
- అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఫిర్యాదులకు అవకాశం
- రైతులు ఆర్థికంగా లబ్ది పొందాలన్నదే నా లక్ష్యం
- వీరాయపాలెంలో 'అన్నదాత సుఖీభవ' ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకోస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రైతు రాజుగా మారాలి. ఎన్ని కష్టాలు ఉన్నా.. ప్రజలు సుఖసంతోషాల తో ఉండాలనేది నా ఆకాంక్ష. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ పథకాలతో పేదలను గట్టెక్కించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

**ఒంగోలు:** ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరిందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా

మిగతా 5 లో

## 20వ విడత కిసాన్ సమ్మాన్

# నిధి విడుదల

వారణాసి పర్యటనలో ప్రారంభించిన ప్రధాని మోడీ




04

**మోడీ స్వదేశీ వస్తు నినాదం**

ఇతర దేశాలపై ఆధారపడకుండా సాగాలి
ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు

## లోక్‌సభ ఎన్నికల్లో

# భారీ రిగ్గింగ్



బీజేపీకి అనుకూలంగా ఎన్నికల సంఘం పనితీరు

- దాని ఆధారాలు తమవద్ద ఉన్నాయి
- తాము అధికారంలోకి వచ్చాక దేనినీ వదలం
- అధికారులు రిటైర్ అయినా శిక్షిస్తాం
- కాంగ్రెస్ న్యాయసమీక్ష సదస్సులో రాహుల్

02



## సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల

# పునర్వ్యవస్థీకరణ

- కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు
- నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ భవనాలు
- గచ్చిబౌలిలో భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు
- మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఆగస్ట్ 2:** ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను

మిగతా 3 లో

## ప్రపంచంతో పోటీ పడాలనే

# స్పోర్ట్స్ పాలసీ

క్రీడల్లో యువత రాణించాలి

- యువత పెడదోవ పట్టకుండా క్రీడల్లో ప్రోత్సాహం
- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి




స్పోర్ట్స్ పేజీలో..

ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకు వస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించా ల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలను ప్రోత్సహించక పోవడం వల్లే యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు.



## పుష్కలంగా నీరున్నా..

# నిర్వహణ లేదు

- అందుకే రాష్ట్రాల మధ్య జల వివాదాలు
- మంగళగిరి వేదికగా పలు కార్యక్రమాలకు గడ్కరీ శ్రీకారం

.. వివరాలు 5లో

## బనకచర్లపై లోకేశ్‌వి

# అవగాహన లేని మాటలు



కెటిఆర్‌తో రహస్య భేటీ తరవాతనే తెరపైకి.. డిప్యూటి సిఎం భట్టి సంచలన వ్యాఖ్యలు

02



## బీసీ రిజర్వేషన్ల పేరుతో

# కాంగ్రెస్ డ్రామాలు

- 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలి
- కామారెడ్డి డిక్లరేషన్‌కు ఎందుకు కట్టుబడలేదు
- ఇందిరాపార్క్ వద్ద సభలో బీజేపీ నేతల డిమాండ్

03



## దేశ ప్రగతికి చిహ్నాలు రోడ్లు, రవాణా మార్గాలే

ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి

.. వివరాలు 5లో




# రేపు తెలంగాణ క్యాబినెట్

**హైదరాబాద్, ఆగస్టు 2:** తెలంగాణ క్యాబినెట్ సమావేశం సోమవారం జరుగనున్నది. మధ్యాహ్నం 2 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రెటేరియట్ లోని ఆరో అంతస్తులో భేటీ కానున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు తెలియజేశారు. ఈ మేరకు ఆయన పేరుతో ఒక ప్రకటన విడుదల చేశారు. క్యాబినెట్ సమావేశం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు, ప్రిన్సిపల్ సెక్రెటరీలు, సెక్రెటరీలు తమతమ హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తన ప్రకటనలో ఆదేశించారు.

# మంత్రి కొండా కోర్టు షాక్

**కేటీఆర్ పరువునష్టం కేసులో క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్టు 2:** మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఫోన్ ట్యాంపింగ్, డ్రగ్స్, టాలీవుడ్ హీరోయిన్ సమంత విడాకుల వ్యవహారంలో కొండా సురేఖ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో కొండా సురేఖపై ఆగస్టు 21లోగా క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితురాలికి నోటీసు జారీ చేయాలని స్పష్టం చేసింది. కేటీఆర్‌పైన మంత్రి నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేటీఆర్ తరఫున న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతోపాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్స్‌ను పరిశీలించిన తర్వాత ఆదేశాలు జారీ చేసింది.నిందితురాలు కొండా సురేఖపై ప్రాథమిక కేసు ఉన్నట్లు నాంపల్లి కోర్టు గుర్తించింది.

# బనకచర్లపై లోకేశ్‌వి అవగాహన లేని మాటలు

**మిగులు జలాల గురించి అప్పుడే ఎలా తేలుస్తారు**


**కెటిఆర్‌తో రహస్య భేటీ తరవాతనే తెరపైకి బనకచర్ల**

**డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు**



**కొల్లాపూర్, ఆగస్టు 2 :** బనకచర్లపై లోకేశ్ తదితర మంత్రుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అసలు జలాలకే మోక్షం లేదంటే ఇక మిగులు జలాలు ఎక్కడివని అన్నారు. తెలంగాణ వినియోగించుకోగా వచ్చిన నీళ్లు వాడుకుంటామని అంటున్నారని, అది ఇప్పట్లో సాధ్యం కాదన్నారు. పోలవరం లాంటి ప్రాజెక్టును పూర్తి చేయలేక పోతున్నారని అంటూ..ముందు దాని సంగతి చూడాలన్నారు. ఎపి మంత్రులు బనకచర్ల విషయంలో చేస్తున్న ప్రకటనలు వాస్తవ విరుద్ధమన్నారు, ఇకపోతే కెటిఆర్ లోకేశ్ కలిసిన తరవాతనే లోకేశ్ బనకచర్ల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఈ ఇద్దరి మధ్య చీకట్లో ఏ ఒప్పందం కుదరిందో చెప్పాన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు- చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కృష్ణా నదిపై గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు న్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదన్నారు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగిందన్నారు. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. మిగులు జలాలు ఉంటేకదా బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకోవచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరఫున పోరాడేందుకు మేం సిద్ధంగా ఉన్నామని డిప్యూటి సిఎం అన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న నితిన్ గడ్కరీ



**తిరుమల,ఆగస్ట్2:** కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన గాయత్రి నిలయంలో బస చేశారు. ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లి, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి దగ్గరుండి దర్శనం చేయించారు.

# లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 2 :** మొన్నటిలోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్షిక న్యాయ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత దేశంలో ఎన్నికల సంఘం న్యాయ సమ్మతంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయవద్దు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ తెలిపారు. ఆ రిగ్గింగ్‌కు చెందిన డేటా, డాక్యుమెంట్లు- తమ వద్ద ఉన్నాయన్నారు. దీన్ని మేం నిరూపిస్తామని, ఆ డేటా ఇప్పుడు ఉందని రాహుల్ పేర్కొన్నారు. ఓ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన అధ్యయనాన్ని ఆయన వెల్లడించారు. ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొన్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు- గెలవలేదని, నాకు ఆశ్చర్యం వేసిందని, ఎప్పుడైనా ఎన్నికల అవకతవకల గురించి మాట్లాడితే ఆధారాలు అడుగుతున్నారని రాహుల్ అన్నారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ మార్పు కనిపించిందని, లోక్‌సభకు.. విధానసభకు



ఎన్నికల జరిగిన సమయంలో కొత్తగా కోటి ఓటర్లు జత కలిశారని, దాంట్లో ఎక్కువ శాతం ఓట్లు బీజేపీకి వెళ్లాయని, అందుకే తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నాని రాహుల్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మరోమారు భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ రాహుల్ గాంధీమరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. ఎన్నికల దుర్వినియోగానికి సంబంధించిన అన్ని ఆధారాలు తమవద్ద ఉన్నాయని.. లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ ఎలా జరిగిందనే విషయాన్ని త్వరలోనే తాము ప్రజల ముందు నిరూపిస్తామని పేర్కొన్నారు. తాము బయటపెట్టే నిజంతో ఈసీ (ఊఈ) పునాదులు కదిలిపోతాయన్నారు. ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న ఎన్నికల కమిషన్ అధికారులు పదవీవిరమణ చేసినా కూడా వారిని వదలమని హెచ్చరించారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన.. దాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని అన్నారు. కాగా ఈ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలేనని.. రాహుల్ లాంటి వారు చేస్తోన్న బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదని తెలిపింది.

# దళితులు, ఆదివాసీల సంక్షేమానికి కృషి

- సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం
- స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్
- పదవులను త్యాగం చేసిన ఘనత సోనియాది
- రాహుల్‌ను ప్రధానిని చేస్తామని తెలంగాణ పక్షాన హామీ
- 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
- మోడీని గద్దెదించడం కేవలం రాహుల్‌కు మాత్రమే సాధ్యం
- కాంగ్రెస్ న్యాయ సదస్సులో రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 2 :** దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని అన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని తెలిపారు. ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా,గెలిచినా ప్రజల మధ్యే ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని,11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించ ట్లేదని అన్నారు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు. కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు. 2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయిననప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అద్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయీ, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాటం విజయవంతం కాబోతుందని అన్నారు. దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని, రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడంలేదని, దేశానికి మార్గదర్శనం



కోసం మనుసింఘ్వీ నేతృత్వంలో సదస్సు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో దేశానికి ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చిన రాహుల్ గాంధీ వదులుకున్నారని.. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. మోడీని ప్రధాని గద్దె మీద నుంచి కిందకు దించడం ఒక్క రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. మోడీని తరిమికొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు. మోడీని ఓడిస్తాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామన్నారు. మాది ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు. పాకిస్థాన్ ను ఇందిరా గాంధీ రెండు ముక్కలు చేశారు. తీవ్రవాదంపై పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అని కొనియాడారు.

# పార్లమెంట్ సాక్షిగా యూరియాపై తప్పుడు లెక్కలు


**ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే**

**ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు**

**కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ**



**హైదరాబాద్, ఆగస్ట్ 2:** పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటు-లో ఉందని చెప్పడం వలన రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని మంత్రిగారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ గారికి కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల లేఖ రాశారు. ఖరీఫ్ 2025 కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని, కేటాయించిన దానిలో కూడా నెలవారి సరఫరా చేయాల్సిన దానికంటే తక్కువగా సరఫరా చేయడం వలన రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాగారికి లేఖలు కూడా రాయడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలో కూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, జులై మాసం వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు లేఖలో కోరారు.




# అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి**

**పెద్దపల్లి,ఆగస్ట్ 2 :** మంథని నియోజకవర్గంలో అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పంపిణీ చేశారు. శనివారం మంథనిలోని ఆర్ఆర్ గార్డెన్స్ లో నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు ముఖ్య ప్రకటనలు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. సన్న బియ్యం సరఫరా సక్రమంగా జరిగేలా రెవెన్యూ అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి గుర్తుచేశారు. మంథని అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు, త్వరలో మంథనిలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు- చేయనున్నట్లు- తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రజల బతుకుల్లో ఏదో మార్పు వస్తుందన్న ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్ కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని ఆయన విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఏమి కావాలి వారిలో ఏ మార్పు తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం ఇప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు.

# కాళేశ్వరం కేసులో కేసీఆర్ పక్కా దోషి

- కమిషన్ విచారణలో అదే తేలింది
- సొంత లాభం కోసం లక్షకోట్లు వృథా చేసిన కేసీఆర్
- అందుకు మూల్యం చెల్లించక తప్పదు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్



**సంగారెడ్డి, ఆగస్ట్ 2:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఆందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు. ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్లు కక్కక తప్పదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. మాజీ సిఎం కెసిఆర్ సొంత లాభం మాత్రమే చూసుకున్నారని తెలిపారు. కెసిఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ తేల్చిందని అన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్న నియోజక వర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయని, ప్రతిపక్షాల కుట్రల వల్ల వేరే పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని తెలియజేశారు. కాంగ్రెస్‌లో గ్రూపులు సహజం.. పార్టీలో గ్రూపులు ఉండాలని, ఎన్నికల సమయానికి అందరూ పార్టీ కోసం పోరాడాలని సూచించారు. గ్రూపుల వల్ల నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత తమది అని హామీ ఇచ్చారు. కెసిఆర్ కుటుంబం అబద్ధాల పుట్టని, బిఆర్ఎస్ చేతగానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్టుకు ఎపి ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. తమ ఫిర్యాదు వల్లే బనకచర్ల ప్రాజెక్టు పనులు ఆగాయని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు

- 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలి
- కామారెడ్డి డిక్లరేషన్‌కు ఎందుకు కట్టుబడలేదు
- ముస్లిం రిజర్వేషన్లతో బీసీల కోటాకు గండి
- కేంద్రం, బీజేపీపై నెపం నెట్టి తప్పించుకునే యత్నం
- ఎంతమంది బీసీలకు పదవులు కట్టబెట్టారో చెప్పాలి
- ఇందిరాపార్క్ వద్ద సభలో బీజేపీ నేతల డిమాండ్



**హైదరాబాద్, ఆగస్ట్ 2:** రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలో కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని.. కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనేక విధాలుగా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను పీఎం, సీఎంలను చేసిందా?అని ప్రశ్నించారు. బీసీలకు జనాభా సేకరణ తర్వాతే సామాజిక న్యాయం జరుగుతుంది. ఢిల్లీలో అనేక రకాలుగా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి మాటలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. బీసీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ధర్నా నిర్వహించింది. బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బీజేపీ నేతలు ఎండగట్టారు. బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గతంలో అమలైన 35 శాతం కంటే కూడా రెండు శాతం రిజర్వేషన్లు తగ్గించేలా కాంగ్రెస్ కుట్ర చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. 20 శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలో జనాభా పెరిగిందని బీసీల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారని తెలిపారు. తెలంగాణ ఏ విషయం లో ఆదర్శమో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాయలో మనం పడకూడదని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం అన్ని బీసీ సంఘాలు పోరాటం చేయాలని కోరారు. బీసీలకు బీజేపీ అండగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీ జనాభా సేకరణను కాంగ్రెస్ గతంలో ఎందుకు చేయలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ఇంకా ప్రయత్నిస్తూనే ఉందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కానీ బీసీ నేతను ముఖ్యమంత్రి చేశారా అని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పేరుతో రాజకీయం చేయాలని చూస్తోందని.. బీసీలకు ఎక్కడ ప్రాధాన్యమిచ్చిందని నిలదీశారు. తొమ్మిది మంది కార్పొరేషన్ ఛైర్మన్లను నియమిస్తే ఒక్క బీసీ నేతకు మాత్రమే అవకాశమిచ్చారని విమర్శించారు. క్యాబినెట్‌లో కేవలం ముగ్గురు బీసీ మంత్రులు మాత్రమే ఉన్నారన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. 42 శాతం రిజర్వేషన్లు కేవలం బీసీలకు మాత్రమే ఇవ్వాలని, ఇతర మతాల వారిని కలపొద్దని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల పేరుతో రేవంత్ రెడ్డి బీసీలను నిలువునా మోసం చేస్తున్నారని, 20 నెలలు దాటిపోయింది రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేకపోతున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నంత కాలం బీసీ ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ ఉన్నంత కాలం బీసీ అధ్యక్షుడు కయ్యే పరిస్థితి లేదు. కాంగ్రెస్ హయాంలో బీసీ ముఖ్యమంత్రిని చేయలేదు, భవిష్యత్‌లో కూడా చేస్తారనే నమ్మకం లేదు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే ముఖ్యమంత్రి నీ భరతం పడతామని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల్లో బిసిలను ఎందుకు విమర్శించారని మండిపడ్డారు. అవకాశం ఉన్నచోట ఇవ్వకుండా కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందన్నారు. దీనిని బిసిలు నమ్మరని అన్నారు.



# యువతను క్రీడల వైపు మళ్లిస్తున్నాం

## అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేయత్నం

## క్రీడల యువజన సర్వీసుల మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 2:** యువతను క్రీడల వైపు మళ్లిస్తూ ,అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దుటకు తెలంగాణ క్రీడల పాలసీని తీసుకురావడం జరిగిందని రాష్ట్ర క్రీడల యువజన సర్వీసుల పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శనివారం హెచ్ఐసీసీలో ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కన్ క్లేవ్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసులు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే కొత్తగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తూ అన్ని క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన ఈ పాలసీ ద్వారా క్రీడలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని అన్నారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ వాటి ప్రాముఖ్యతను పెంచే విధంగా నూతన క్రీడా విధానం అమలు చేస్తూ అమలు చేయుటలో పని చేస్తామని మంత్రి తెలిపారు. ఈ పాలసీ అమలులో గతంలో క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు, దీర్ఘకాలంగా క్రీడల్లో ఉన్న వారు, క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించే వారికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభిస్తున్న క్రీడల పాలసీ క్రీడల అభివృద్ధి కొరకు క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయుటకు దోహదపడుతుందని మంత్రి తన అభిప్రాయాన్ని తెలిపారు. ఈ పాలసీలో పొందుపరిచిన జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వాహకుల సహాయ సహకారాలు తీసుకొని ఆస్థాయిలో క్రీడల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. 2036లో జరిగే ఒలింపిక్స్ ను లక్ష్యంగా చేసుకొని క్రీడాకారులకు ఆయా క్రీడలలో శిక్షణ ఇప్పించడం జరుగుతుందని, తమ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా క్రీడాకారులకు విధి విధానాలను కల్పిస్తూ ఈ పాలసీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపారని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం బడ్జెట్లో క్రీడలకు ఎక్కువ నిధులు కేటాయించిందని, క్రీడల స్టేడియాలకు, క్రీడాకారుల వసతులకు, వసతులకు క్రీడాకారులకు కల్పించే మౌలిక వసతులకు అధిక నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ- చైర్మన్ శివసేనారెడ్డి, అడ్వైజర్ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి వేణుగోపాల చారి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్ రంజన్, వైస్ ఛైర్మన్, ఎం.డి. సోనీ బాల, గోపిచంద్ అకాడమీ ఫౌండర్ పుల్లెల గోపీచంద్, ప్రముఖ క్రీడాకారులైన గగన్ నారంగ్, అంజు బాబి జార్జ్, సుమిత్ పాండే, అభినవ్ బింద్రా, రవికాంత్ రెడ్డి, నీలం బాబర్ దేశాయ్, తతగత ముఖర్జీ, సబనాయకన్ విశ్వనాథ్, అడిళ్ళ సుమరివాల, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న స్పీకర్



**వికారాబాద్, ఆగస్టు 2 :** తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముగించుకుని వస్తుండగా, అనంతగిరి గుట్ట దిగువన బైక్ యాక్సిడెంట్ అయి రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తిని గుర్తించారు. వెంటనే కాన్వాయ్ ఆపి వాహనం దిగారు. బాధితుడిని పరామర్శించి అవసరమైన ప్రథమ చికిత్స అందించాలని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. అంబులెన్స్ ను పిలిపించి గాయపడ్డ వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని స్థానిక పోలీసులను స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశించారు. ప్రమాద ఘటన చూసిన వెంటనే సభాపతి కాన్వాయ్ ఆపడం, ఆయన స్పందించిన తీరు, బాధితుడికి ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించడాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షులు సభాపతి గారిని ప్రశంసించారు.

# సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ



## రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఆగస్ట్ 2:** ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీ కరించడంతో పాటు- కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్ల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టు-కొని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవన్నీ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టు-కొని ఒకే చోట ఇంటిగ్రే-టె-డ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14కు గాను మూడు చోట్ల , మేడ్చల్ జిల్లాలో 12కు గాను మూడు చోట్ల, సంగారెడ్డి, పఠాన్‌చెరువు కలపి ఒకటి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పోరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి గ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుందని అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండడంతో పాటు- దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందన్నారు. మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఒక రోల్ మోడల్‌గా ఉంటుందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ఈ బిల్డింగ్ నమూనాకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరితగతిన ఈ భవనానికి శంకుస్థాపన చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## సంపాదకీయం



# ఎదురుదాడితో అక్రమాలను దాచలేము!

ఎదురుదాడి రాజకీయాల్లో ఇప్పుడు బిఆర్ఎస్, ఎపిలో వైకాపాలు ఆరితేరాయి. చేసిన తప్పులు, అప్పుల గురించి ఎవ్వరూ చర్చించుకోవద్దన్న పాలసీతో వీరు ఎదుటివారిపై బురదజల్లాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరూ ఒకే గూటి పక్షులుగా ఉన్నారు. ఎపిలో అప్పులు చేసి, బటన్ నొక్కుళ్లతో రాష్ట్రాన్ని దివాళా తీయించి, సొంత ఖజానా నింపుకున్న ఘనుడు జగన్. తెలంగాణలో కూడా కుటుంబం గుప్పిట్లో అధకారం పెట్టుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కెసిఆర్ కుటుంబానిది. అంతేగాకుండా లెక్కకు మిక్కిలి అప్పులు చేసి ఇప్పుడేమో....మాకా సంగతే తెలియదన్న రీతిలో పోజులు పెడుతున్నారు. కెటిఆర్, హరీష్ రావుల విమర్శలు చూస్తుంటే సిగ్గేస్తోంది. జాలి కలుగుతోంది. ఎందుకంటే చేసిన తప్పులన్నీ చేసి, మళ్లీ తమదే అధికారం కనుక ఇవేవీ బయటపడవన్న ధీమాతో ఉండిపోయారు. కానీ ప్రభుత్వం మారడంతో అప్పులు, తప్పులు బయటకు తన్నుకు వస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకో అంశంపై విమర్శలు చేస్తున్నారు. గురుకులాలు, హాస్టళ్లు, రైతులు, బనకచర్ల, విద్యుత్ పంపిణీ తదితర అంశాలపై వీరు చేస్తున్న విమర్శలు అన్నీ ఇన్నీ కావు. నిజంగానే పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇవన్నీ బాగావుంటే, బాగుచేసివుంటే ఇప్పుడే పాపం ఎందుకు బద్దయలయ్యిందన్నది ప్రజలు ఆలోచించాలి. అన్నింటికి మించి కాళేశ్వరంలో లక్షకోట్లు తగలేశారు. వారికి రావాల్సిన ముడుపులు రావడంతో ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇవన్నీ ప్రజలు చర్చించుకోవద్దన్న భావనలో రోజూ బనకచర్లను ముందుకేసి విమర్శలు చేస్తున్నారు. సిఎం ప్రజల్లోకి రావడమెందుకు, ఆయన ప్రజలను కలవాల్సిన పనేముందని వాదించిన కెటిఆర్ ఇప్పుడు పనిచేసే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడు. నవ్విపోదురు నాకేంటి అన్న చందంగా కెటిఆర్,హరీష్ రావుల విమర్శలకు హద్దూపద్దూ లేకుండా పోతోంది. అలాగే జగన్ తీరు కూడా అలాగే ఉంది. వీరు దోచుకోవడం అన్న స్కూళ్లో శిక్షణ పొంది వచ్చినవారు. ఇక కాళేశ్వరం నివేదిక చూస్తే ఆశ్చర్యం కలగమానదు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది. ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసినవారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంటూ నివేదిక రూపొందించింది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని తెలుస్తోంది. వీటి గురించి కెటిఆర్ మాట్లాడరు. హరీష్ రావు మాట్లాడరు. నోరుంది కదాని తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నాల్లో ఈ ఇద్దరూ ఆరితేరారు. అయితే మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పడం ఇంకా మోసం చేయడం తప్ప మరోటి కాదు. ఒక ఉద్యమ పార్టీగా ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేయకుండా వారి నమ్మకాన్ని దెబ్బతీసింది. ఒక కుటుంబానికి వ్యాపార సామ్రాజ్యంగా మారిందనడానికి కాళేశ్వరం సహా అనేక ఉదాహరణలు ఉన్నాయి. గొర్రెల పంపిణీలో వేయికోట్ల మోసం అంటే ఎంత దారుణమో గుర్తించాలి. ఒక ఉద్యమ పార్టీ ఎంతగా అహంకారంగా ప్రవర్తించిందో చూసాం. ప్రజలు ఎలా మోసపోయారో చూసాం. ఇందుకు కాళేశ్వరం, గొర్రెలు, చేపలు, రైతుబంధు వంటి అన్ని పథకాలు చూడవచ్చు. సిఎం రిలీఫ్ ఫండ్ పేరుతోనూ మోసాలు సాగించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక అనవసరంగా గట్టిగా రంకెలు వేస్తోంది. ఒక్కో అవినీతి బయటపడ్డా కొద్దీ జీర్ణించుకోలేక పోతున్నది. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి ఆశయాల మీద చేసిన మోసపూరి రాజకీయం బహుశా చరిత్రలో ఎవరూ చేసివుండరు. ఒక నాయకుడు తప్పు చేస్తే దాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ ఇక్కడ పార్టీతో పాటు,ఓ కుటుంబం మోసం చేసింది.అయినా పదేళ్లుగా మీడియా ఈ విషయం ప్రసారం చేయలేదు. దాన్ని ఇప్పుడైనా ప్రశ్నించాలి. మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు. ప్రజాస్వామ్యంలో అది క్షమించదగినది కాదు. అసలు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని అమ్ముకోవడమెలాగో నేర్చింది. ఇన్న తప్పులకు కారణమైన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేస్తున్న విమర్శలు...దగుల్బాజీ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. నిరాశా నిస్పృహల్లో ఉంటూ ప్రస్తుత పరిస్థితిని చూసి తట్టుకోలేని మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారు. రాజకీయాల్లో నీతిగా మాట్లాడటం బిఆర్ఎస్, వైకాపా నాయకులకు రాదు. వీరు పాలనార్హత లేనివారు. ప్రజల తీర్పును గౌరవించలేక, దాన్ని హేళన చేయడమంటే అది ప్రజల ను నిందించడమే అవుతుంది. జగన్, కెటిఆర్‌లు ఇది గమనించాలి. ప్రజలను అవమానిస్తున్న ఈ నేతలను ప్రజలు దూరంగా పెట్టాలి. బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణకు సాధ్యమైనంత మోసం చేయమెలా అన్న రీతిలో పాలన సాగింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మేరకు అసలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని రాలేకపోయింది.రైతులు అప్పుల్లోనే ఉన్నారు, యువత నిరుద్యోగంలో ఉన్నారు. రుణమాఫీ రాయితీల పేరుతో కొంతమంది మాత్రమే లబ్ధి పొందారు. పేపర్ లీకులు, గ్రూప్ పరీక్షల వాయిదాలు, పోలీస్ పరీక్షల గందరగోళం ఇవన్నీ యువత భవిష్యత్తును నాశనం చేశాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అప్పు రూ. 6.5 లక్షల కోట్లకు చేరింది. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇవన్నీ పేరుకి ప్రాజెక్టులు. కానీ అన్నీ అవినీతి పథకాలే. జేబులు నింపే పథకాలే. గ్రామాల్లోకి తాగునీరు, విద్య, ఆరోగ్య పరిరక్షణకు తీసుకున్నచర్యలు లేవు. ఇవన్నీ కూడా ఇక్కడ బిఆర్ఎస్‌కు ఎపిలో వైకాపాకు వర్తిస్తాయి.

# మోడీ స్వదేశీ వస్తు నినాదం

- ఇతర దేశాలపై ఆధారపకుండా సాగాలి
- ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు




**వారణాసి, ఆగస్ట్ 2:** భారత్ కూడా అతి త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారనుందని ప్రధాని మోడీ మరోమారు ఉద్ఘాటించారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోదీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'డెడ్ ఎకానమీ' అంటూ ఆయన చేసిన విమర్శలపై ప్రధాని నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితిన నెలకొంది. అన్ని దేశాలు తమ తమ సొంత ప్రయోజనాలపైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంకట్టాలి. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఇటీవల భారత్-రష్యా బంధంపై ట్రంప్ స్పందిస్తూ.. ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను దిగజార్చు కోనీయండని, కలిసి మునగనీయండని విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అంతకుముందు న్యూఢిల్లీపై 25శాతం సుంకాలు విధించిన అగ్రరాజ్యాధినేత.. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తే అదనంగా పెనాల్టీలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మోడీ తదితరుల పేర్లు చెప్పాలని ఒత్తిడి

## మాలేగావ్ కేసులో నిర్దోషి ప్రజ్ఞా ఠాకూర్



**భోపాల్, ఆగస్ట్ 2:** మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన భాజపా మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. భాజపా సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ సహా పలువురి పేర్లు చెప్పాలని వారు నాపై ఒత్తిడి తెచ్చారు. నన్ను హింసించారు. నన్ను ఆసుపత్రిలో అక్రమంగా నిర్బంధించారు. నేను గుజరాత్‌లో నివసించడం వల్ల ప్రధాని మోదీ పేరు కూడా చెప్పించాలని చూశారు. నేను అబద్ధాలు చెప్పాలని వారు ప్రయత్నించారు. అవి అబద్ధాలు కావడంతో నేను ఎవరి పేరు చెప్పలేదని ప్రజ్ఞ మీడియాతో మాట్లాడారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీ-ఎస్ అధికారి మహబూబ్ ముజావ్ కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన సంగతి తెలిసిందే. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు- మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు- చెప్పారు. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందితో పాటు- రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు- వెల్లడించారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు- రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది. ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు అని తీర్పు వెలువరించింది.

# అత్యాచారం కేసులో రేవణ్ణకు జీవిత ఖైదు

## పదిలక్షల పరిహారం కూడా ఎల్లించాలని ఆదేశం

## ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు

**బెంగళూరు, ఆగస్ట్ 2 :** ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో మాజీప్రధాని దేవేగౌడ మనవడు, హాసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ కు జీవిత ఖైదు పడింది. దీంతోపాటు- రూ. 10లక్షల జరిమానా విధిస్తూ బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి రూ. 7లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే.. రేవణ్ణను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపీ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. ఆగస్టు 1న తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చాడు. కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న హొళెనరసీపుర ఠాణాలో ప్రజ్వన్ రేవణ్ణపై ఫిర్యాదు చేయడంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉండగా తాజాగా శిక్ష ఖరారైంది. అత్యాచారం కేసులో శనివారం కోర్టు ఆయనకు ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించింది. అత్యాచారం, లైంగిక వేధింపులు, సాక్ష్యాలను నాశనం చేయడం, అత్యాచారానికి సంబంధించిన వీడియోలను సర్క్యులేట్ చేయడం వంటి ఆరోపణలపై దోషిగా తేలడంతో రేవణ్ణకు జీవిత ఖైదుతోపాటు- కోర్టు రూ. 10 లక్షల జరిమానా కూడా విధించింది. లైంగిక వేధింపులు, అత్యాచారం సమయంలో వీడియోలను రికార్డ్ చేశాడని.. ఎవరికైనా చెబితే ఆ వీడియోలను విడుదల చేస్తానని బెదిరించాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.





# 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

## వారణాసి పర్యటనలో ప్రారంభించిన ప్రధాని మోడీ

**వారణాసి, ఆగస్ట్ 2:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా విడుదల చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ. 20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ. 6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ. 2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతాయి. అంతకుముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ. 9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు. వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ. 2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు- శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు సహా రకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈ కర్యక్రమంలో సిఎం యోగి తదితరులు పాల్గొన్నారు.

# 46,85,838 మంది రైతులకు అన్నదాత సుఖీభవ

మొదటి పేజీ తరువాయి



ఒక్కో రైతుకు రూ.5,000 చొప్పున జమ చేశాం. దీనికోసం రూ.2,343 కోట్ల నిధుల్ని కేటాయించాము. మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2,000 చొప్పున రూ.832 కోట్లు ఇస్తోంది. మొదటి విడతలో కేంద్రం- రాష్ట్ర వాటాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7,000 జమ చేశాం. ఈ విడతలో రైతులకు రూ.3,175 కోట్ల మేర లబ్ది కలుగుతోందని అన్నారు. పథకం అమలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఫిర్యాదులు, సందేహాలు ఉన్నా అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని ఆర్ఎస్ కే లాగిన్ ద్వారా తెలుసుకోవచ్చని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే 155251 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏ పంట వేస్తే లాభాలు వస్తాయన్నది అధ్యయనం చేసి వారికి సూచనలు జారీ చేస్తామని వెల్లడించారు. సూపర్ సిక్స్‌లో ప్రధాన హామీ అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రకాశం జిల్లా, దర్శి మండలం, వీరాయపాలెంలో ప్రారంభించారు. పచ్చని పొలాల్లో రైతుల మధ్య కూర్చుని ఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. కర్షక సోదరులతో కలిసి పథకాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమచేశారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో కాసేపు ముచ్చటిం చారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో గత ప్రభుత్వానికి...కూటమి ప్రభుత్వానికి గల వ్యత్యాసం ఎంత మేర ఉందో చూడాలని సీఎం అన్నారు. ఎన్నికల్లో చేసిన ప్రకటన మేరకు రైతులకు ఏటా రూ.20,000 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చామన్నారు. ఈ పథకం ద్వారా 3 విడతల్లో రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేస్తామని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇలా పచ్చని పొలాలు, దేశానికి అన్నం పెట్టే రైతుల మధ్య ప్రారంభించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. 'రైతు కళ్లల్లో ఆనందాన్ని నేరుగా చూస్తున్నాను. రైతు ఎప్పటికీ రాజే. కరోనా వంటి విపత్తులోనూ అన్నదాత నాగలి చేతపట్టి పొలంలో పనిచేశాడు. ఎన్ని కష్టాలున్నా రైతులు బాగుండాలనేది నా కోరిక. ఎన్నికలకు ముందు విధ్వంస, సైకో పాలనతో అందర్నీ ఇబ్బంది పెట్టి వారు ఆనందపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే సూపర్ సిక్స్ అమలు నాకు మాటల్లో చెప్పలేని సంతోషాన్నిస్తోంది. అన్నదాత సుఖీభవ కింద ప్రకాశం జిల్లాకు రూ.186 కోట్లు- ఇస్తున్నాం. జిల్లాలోని 2,65,317 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా లబ్ది కలుగుతోంది. అలాగే దర్శి నియోజకవర్గంలో 42,786 మంది రైతులకు రూ.29 కోట్లు- ఇస్తున్నాం. దర్శి మండలంలో 10,972 మంది రైతులకు రూ.7.36 కోట్లు- ఇస్తున్నాం. ఒక్క వీరాయపాలెంలోనే 476 మంది రైతులకు రూ.31,00,000 లక్షలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీ-డీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టు-కుని ఎన్నికలకు వెళ్లాం. ప్రజలు బ్రహ్మాండమైన మెజారిటీ-తో గెలిపించారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేసింది. చాలా సమస్యలు వచ్చాయి. ఎన్ని కష్టాలున్నా, ఇచ్చినమాట నిలబెట్టు- కోవాలని సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం. నేను హామీ ఇచ్చినట్టే పెంచిన రూ. 4000 పింఛను గత ఏడాది ఏప్రిల్ నుంచే ఇచ్చాను. పింఛన్ల కోసం ఏడాదికి 64 లక్షల మందికి రూ. 32,134 కోట్లు- ఖర్చు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.1000 మాత్రమే పెంచింది. భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్ ఎగ్గొట్టారు. ఎవరైనా లబ్దిదారులు రెండు నెలలు పింఛను తీసుకోక పోయినా మూడు నెలల మొత్తాన్ని ఒకేసారి ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు ఇచ్చాం. గత ప్రభుత్వం అందరికీ ఇస్తామని ఎన్నికల్లో చెప్పి తీరా గెలిచాక మాట మార్చి ఒక్కరికే పరిమితం చేశారు. దీపం పథకం కింద ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపాను. దీపం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇందుకోసం రూ. 2,700 కోట్లు- వెచ్చిస్తున్నాం. ఈనెల ఆగస్టు 15న స్త్రీ శక్తి కింద ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. దీని వల్ల రాష్ట్రంలోని 2 కోట్ల 60 లక్షలమంది మహిళలకు లబ్ధి చేకూరుతుంది. మీ పెద్దలు ఇచ్చిన ఆస్తి కంటే నేను నెలవారీ చేసే సాయమే ఎక్కువ. ప్రభుత్వం అన్నా క్యాంటీ-న్లు పెట్టి రూ.5 కే భోజనం పెడుతుంటే గత ప్రభుత్వం క్యాంటీ-న్లను మూసేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. వ్యవసాయాన్ని నిలబెట్టేందుకు, రైతుల జీవితాలను బాగు చేసేందుకు ఈ ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోందని అన్నారు. ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించి ఉన్నంతలో ప్రకృతి సేద్యం వైపు రైతులు వెళ్లాలి. ఈ ఏడాది పొలం పిలుస్తోంది కార్యక్రమం కింద 15,424 గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాం. నేను డ్రిప్ ఇరిగేషన్ కింద రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తే గత ప్రభుత్వం రద్దు చేసింది. డ్రిప్ ఇరిగేషన్ రాయితీని ఎస్సీ, ఎస్టీలకు 100 శాతానికి, రాయలసీమ-ప్రకాశం జిల్లాలో 90 శాతానికి, కోస్తాలో 70 శాతానికి పెంచాం అని చంద్రబాబు అన్నారు. గతేడాది 1,17,880 హెక్టార్లకు డ్రిప్ విస్తరించాం. దీని వల్ల 1.11 లక్షల మంది రైతులు లబ్ది పొందారు. డ్రిప్ ఇరిగేషన్ లో ఏపీనే దేశంలో నెంబర్ వన్ గా ఉంది. ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మత్స్య కార సేవలో సాయాన్ని రూ.10,000 నుంచి రూ.20,000కు పెంచాం. దీని వల్ల 1,29,178 మత్స్య కార కుటు-ంబాలు రూ.259 కోట్లు- అందించాం. 26 వేల మంది రైతులకు 50 శాతం రాయితీపై రూ.61 కోట్లతో వ్యవసాయ పనిముట్లు- ఇచ్చాం. సాగుకోసం 875 కిసాన్ డ్రోన్లు త్వరలో సేవలు అందించనున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో మరో వెయ్యి కిసాన్ డ్రోన్లు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టు-కున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు నీరిచ్చాను. రైతులు ఏ వాతావరణంలో ఏ పంట వేయాలో , నీరు ఎప్పుడు ఇస్తామో ముందే చెబుతాం. దాని ప్రకారం పంట వేయమని కోరుతున్నాను. ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా 20 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లు చేపట్టి రైతులు నష్ట పోకుండా చూశాం. ఇందుకోసం రూ.273 కోట్లు- మంజూరు చేశాం. మామిడి రైతులకు కేజీకి రూ.4 చొప్పున అదనంగా ఇచ్చాం. మొత్తం 4,29,521 మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోళ్లు పూర్తిచేశాం. 50,922 మంది రైతులకు రూ.172 కోట్లు- చెల్లించాం. రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి ఇది. 2,358 మెట్రిక్ టన్నుల కోకో కొనుగోళ్లకు కేజీకి రూ.50 చొప్పున రూ.12 కోట్లు- చెల్లించాం. మార్కెట్ ఇంటర్ వెన్షన్ కింద మిర్చి క్వింటాకు రూ.11,781 చొప్పున గిట్టుబాటు- ధర కల్పించాం. మార్కెట్ ఇంటర్ వెన్షన్ కింద మిర్చి క్వింటాకు రూ.11,781 చొప్పున గిట్టు-బాటు- ధర కల్పించాం.రూ.8,282 కోట్లతో ఖరీఫ్‌లో 6 లక్షల మంది రైతుల నుంచి 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, రబీలో రూ.4,575 కోట్లతో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేశాం. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం అని బాబు వివరించారు. సబ్సిడీ విత్తనాల నుంచి గిట్టుబాటు- ధర వరకు అండగా నిలిచాం. 2014-2019 మధ్య మా హయాంలోనే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ తీసుకువచ్చాం. రూ.15,279 కోట్ల రుణ మాఫీ చేశాం. ఉచితంగా భూసార పరీక్షలు జరిపి

1.33 కోట్ల సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చాం. ఎన్టీఆర్ జలసిరి కింద బోర్లు వేశాం. 6 లక్షల పంట కుంటలు తవ్వించాం. రూ.1,488 కోట్లతో4.99 లక్షల మంది రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందించాం. రైతు రథం పేరుతో 23,500 ట్రాక్టర్లు సబ్సిడీపైన పంపిణీ చేశామని సీఎం తెలిపారు. ముందు చూపుతో అన్ని రిజర్వాయర్లకు నీరు వదలడంతో 700 టీఎంసీలతో రిజర్వాయర్లన్నీ కళకళలాడుతున్నాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, కాటన్ బ్యారేజ్, ప్రకాశం బ్యారేజ్, సోమశిలలో సమృద్ధిగా నీరు ఉంది. ఎవరికీ తాగు, సాగు నీటి కొరత లేకుండా నదుల అనుసంధానం చేస్తాం. భూగర్భ జలాల పెంపుపై ప్రజలు కూడా దృష్టి సారించాలని కోరుతున్నాను. 2014-19 మధ్య కాలంలో సాగునీటి రంగానికి రూ. 68 వేల కోట్లు- ఖర్చు చేయగా గత ప్రభుత్వం రూ. 12 వేల కోట్లు- మాత్రమే ఖర్చు చేసింది. గత పాలకులు ఉచిత బీమా పథకాన్ని నాశనం చేస్తే కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ మేం దాన్ని పునరుద్ధరించాం. వైసీపీ హయాంలో రూ.1,670 కోట్ల ధాన్యం డబ్బులను రైతులకు ఎగ్గొట్టారు. కూటమి వచ్చాకే ఆ బకాయిలన్నీ చెల్లించాం. గుండ్లకమ్మ గేట్లకు మేం మ-రమ్మతులు చేసి ప్రాజెక్టును సంరంక్షించాం. వెలిగొండను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వచ్చే సీజన్ కి ఫేజ్ వన్ పూర్తిచేసి కృష్ణా జలాలు వెలిగొండ ద్వారా ప్రకాశం జిల్లాకు తీసుకువస్తాం. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. రాజకీయ ముసుగు వేసుకున్న నేరస్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. 47 ఏళ్ల రాజకీయ జీవితంలో 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నాను. గతంలో ఎన్నడూ చూడని కొత్త రాజకీయాలు చూస్తున్నాను. మన రాష్ట్రంలో ఉన్న ఒక పార్టీ ...అమరావతి ఆడబిడ్డలను వేశ్యలుగా చిత్రీకరించింది. ఆ పార్టీ అధినేత ప్రకాశం జిల్లా పొదిలి వచ్చినప్పుడు ఆడబిడ్డలు క్షమాపణ చెప్పమని కోరగా వారిపై దౌర్జన్యం చేశారు. టీ-డీపీ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని వైసీపీ నేత నల్లపురెడ్డి పశువులా దూషించాడు. పార్టీ అధినేత ఏం చేశాడు? మందలించకుండా.. మా వాళ్లకు చెప్తే చాలు...ఇళ్లలోకి పోయి రప్పా రప్పా లేపేస్తారని అంటు-న్నాడు. బాబాయ్ హత్య విషయంలో నన్నూ ఏమార్చారు. పల్నాడులో వైసీపీ కార్యకర్త ఆయన కారు కిందే పడితే ఎత్తి పొదల్లో పడేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం లో మామిడికి ధర లేదని మామిడి పళ్లను ట్రాక్టర్ల కింద తొక్కించి రాజకీయ విన్యాసం చేశాడు. నెల్లూరులో జనం వచ్చినట్టు- ఫేక్ వీడియో ప్రదర్శించాడని చంద్రబాబు మండిపడ్డారు. రాజకీయ పార్టీలు ప్రజల కోసం పని చేయాలి. వారి అంతిమ లక్ష్యం అధికారమైనప్పటికీ నైతిక విలువలు, పద్ధతులు, నిబంధనలు, కట్టు-బాట్లు- తప్పనిసరిగా పాటించాలి. జగన్ ను చూసి రప్పా రప్పా, బూతుల పంచాంగం, గొడ్డలి వేట్లు- నేర్చుకోవాలా? పేదల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు నేను పనిచేస్తున్నాను. నేను అభివృద్ధి చేసిన తెలంగాణ ఎలా ఉందో చూశారుగా. అంతకు మిన్నగా ఏపీని 2047 నాటికి దేశంలోనే నెంబర్ వన్ గా తయారు చేస్తానని సీఎం చంద్రబాబు తెలిపారు.

# పుష్కలంగా నీరున్నా.. నిర్వహణ లేదు



**అమరావతి :** మనదేశంలో నీటి కొరత సమస్య లేదు.. నీటి నిర్వహణే పెద్ద సమస్య అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అందుకే రాష్ట్రాలమధ్య వివాదాలు వస్తున్నాయి. మనదేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 12 శాతం. అది 22 శాతానికి పెరగాలనేది మా లక్ష్యం అని గడ్కరీ అన్నారు. ఏటా వేల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో వృథాగా కలుస్తోంది. దేశ ప్రగతిలో నీరు, విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ ప్రముఖ పాత్ర పోషిస్తాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఏపీ అభివృద్ధిలో నౌకాయాన శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. తొలుత సభకు వచ్చిన అందరికీ తెలుగులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నమస్కారం చెప్పారు. మంగళగిరి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని రూ.5,233 కోట్ల విలువైన జాతీయ రహదారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షిప్పింగ్, పోర్టులు, రోడ్లు అభివృద్ధి చెందితే ఆ దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఏపీ అన్ని రంగాల్లో వేగంగా దూసుకుపోతోంది. మంచి నాయకుడు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు విజన్ గురించి ఎప్పుడూ వినేవాళ్లం. ఆయన లాంటి విజన్ ఉన్న నాయకుడు అరుదుగా ఉంటారు. ఆయన ఎప్పుడూ భవిష్యత్ గురించే ఆలోచిస్తారని అన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నాం. కొద్దికాలంలోనే జపాన్‌ను అధిగమించాం. ఒకటి, రెండు స్థానాల్లో అమెరికా, చైనా ఉన్నాయి. మోదీ హయాంలో మన రైతులు విద్యుత్ తయారు చేస్తున్నారు. ఇథనాల్ వల్ల దేశంలో రూ.లక్షల కోట్లు ఆదా అవుతాయన్నారు. భవిష్యత్‌లో విమానాలు కూడా రైతులు తయారు చేసే ఇంధనంతోనే నడుస్తాయి. ఇథనాల్, మిథనాల్, సీఎన్‌జీ, బయో డీజిల్ వినియోగం వేగంగా పెరుగుతోంది. ఈవీ వాహనాల తయారీ శరవేగంగా పెరుగుతోంది. లిథియం బ్యాటరీల ఖర్చు క్రమంగా తగ్గుతోంది. వంద శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలు రావాలి. కాలుష్య రహిత దేశమే మన లక్ష్యం కావాలని అన్నారు ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.లక్ష కోట్లతో పనులు ప్రారంభిస్తాం. నాగ్‌పూర్, జబల్‌పూర్‌లో వరిగడ్డి వినియోగించి రోడ్లు వేశాం అన్నారు. అమెరికాలో ఉన్న రోడ్ల వల్లనే అమెరికా రిచ్ అయిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వైపు వెళ్తోందన్నారు.. చంద్రబాబు విజన్ ఉన్న నేత.. ఎప్పటికీ ఆదర్శంగా ఉంటారు. ఆంధ్రప్రదేశ్ లో షిప్పింగ్ వల్ల ఎంతో అభివృద్ధి చెందుతోంది.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ఏపీని అభివృద్ధి చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని కేంద్ర మంత్రి వెల్లడించారు. చంద్రబాబు తను సీఎంగా దేశానికి విజన్ చూపారని.. భవిష్యత్తు పై అవగాహన ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. నాలెడ్జిని వెల్త్ గా మార్చేదే విజన్ అని.. చంద్రబాబు డెవలెప్మెంట్ విజన్ పట్ల ఆయనను అభినందించాల న్నారు. నేను షిప్పింగ్ మంత్రిగా ఉన్నప్పుడు తన వద్ద రూ. 9వేల కోట్లు బడ్జెట్ ఉంటే రూ.12 లక్షల కోట్లు- పనులు చేశామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. పోర్టు ఉన్న రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని.. దీంతో బస్సు, రైలు కన్నా జలమార్గంలో చాలా ఖర్చు తగ్గుతుందన్నారు. ఇండియాలో లాజిస్టిక్ కాస్ట్ 16శాతం ఉంటే చైనాలో 8 శాతం అమెరికాలో 12 శాతం ఉందన్నారు. మనం 9 శాతం లాజిస్టిక్ కాస్టుకు వస్తే ఉద్యోగాలు వస్తాయి.. ఎగుమతులు పెరుగుతాయని తెలిపారు. దేశం రోడ్డు నెట్వర్క్ విషయంలో ఏపీలో ఎంతో వర్కు చేశామన్నారు. ఏపీలో లక్ష కోట్ల పనులు చేశాం.. రెండు నెలల్లోనే అమెరికాతో సమానంగా రోడ్లు తయారవుతాయన్నారు. పోలవరానికి హెలికాప్టర్ లో వెళ్లినప్పుడు ఎంతో నీరు సముద్రంలో కలిసిపోతుందని చూశాం. అమెరికా సాటిలైట్ తో ఏఐ వాడి మా గ్రామంలో వ్యవసాయం చేస్తున్నాం. దేశ ఆర్థికవృద్ధిలో 22శాతం వ్యవసాయం నుంచి వస్తోంది. రోడ్లు బాగా వేయాలనే బాధ్యత ప్రధాని నాకు ఇచ్చారు.. నేను ఇంజినీర్‌ని కాదు. గోదావరి నుంచి కావేరి వరకూ నీటిని ఉపయోగించు కోవచ్చు. ఈ దేశంలో పుష్కలంగా నీరు ఉంది.. నీటి వినియోగం సరిగా లేదు. నా వద్ద ఏపీకి సంబంధించి అతిపెద్ద లిస్టు ఉంది.. వెబ్ సైట్లో వాటి వివరాలను ఉంచుతాం. ఏపీలో కూడా యాక్సిడెంట్ల సంఖ్య ఎక్కువే. యాక్సిడెంట్ విషయంలో చాలా ముందు ఉంది. ప్రతి జిల్లాలో వాటిని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని నితిన్ గడ్కరి వ్యాఖ్యానించారు.

## దేశ ప్రగతికి చిహ్నాలు రోడ్లు, రవాణా మార్గాలే

**అమరావతి :** ఒక దేశ ప్రగతికి చిహ్నాలు రోడ్లు, రవాణా మార్గాలని ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆనాడు వాజ్‌పేయిా ముందుచూపుతో స్వర్ణచతుర్భుజి రహదారులు తెచ్చారని.. ఆయన వేసిన రోడ్ల వల్లే దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రూ.5 వేల కోట్ల విలువైన జాతీయ రహదారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఇవాళ ఏపీలో రూ.5వేల కోట్లతో 29 హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసుకున్నాం. ఎన్డీయే వచ్చాక దేశంలో కీలకమైన ప్రాజెక్టులు చేపట్టింది. ఇవాళ హైవేల నిర్మాణ వేగం మూడురెట్లు- పెరిగింది. అడవితల్లి బాట పేరుతో గిరిజన ప్రాంతాల్లోనూ రోడ్లను నిర్మిస్తున్నారు. 78 ఏళ్లుగా రోడ్లు లేని గిరిజన ప్రాంతాలకు ఇప్పుడు రోడ్లు వేస్తున్నారు. డోలీ మోతలు లేకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంబిగించాయి. మెరుగైన రోడ్లపైనే రాష్ట్ర ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. కూల్చితవేల ప్రభుత్వం, రోడ్లు వేయని ప్రభుత్వాన్ని చూశాం. మరో 15 ఏళ్ల పాటు- కూటమి ప్రభుత్వం బలంగా ఉండాలని అన్నారు. కూల్చివేతలతో గత ప్రభుత్వం మొదలైతే.. ప్రతీ గ్రామంలో కూటమి ప్రభుత్వం గుంతలు పూడ్చి కొత్త రహదారులు నిర్మిస్తోంది. కూటమి ఐక్యతను దెబ్బతీసే కుట్రలన్నింటినీ ఐక్యతతో ఛేదిద్దాం. కూటమి నాయకుల మధ్య చిన్న చిన్న పొరపొచ్చాలు వచ్చినా.. పరిష్కరించుకుని కలసికట్టు-గా ముందుకు సాగుదాం. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. ఇవాళ దేశ ప్రగతికి, పురోగతికి సంబంధించిన కార్యక్రమానికి ఏపీ వేదికైంది. సుస్థిర ఆర్థికాభివృద్ధితో దేశం ముందుకెళ్తోంది. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు ప్రధాన ఆయుధం మౌలిక వసతుల కల్పన. హైవే మాన్ ఆఫ్ ఇండియాగా గడ్కరీ జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి గడ్కరీ.. ఈ ముగ్గురి విజన్‌తో దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని పవన్ అన్నారు. ప్రపంచంలో అత్యంత ప్రభావ వంతమైన నాయకులుగా మోడీ గుర్తింపు తెచ్చుకున్నారు.. వికసిత భారత్ వైపు ప్రయాణం చేస్తున్నాం.. గడ్కరీ దూరదృష్టి పట్టుదల ప్రత్యేకమని పవన్ అన్నారు. లక్ష 46 వేల కిమి జాతీయ రహదారులు పెరిగాయి. నిర్మాణ వేగం మూడు రెట్లు- బడ్జెట్ ఆరు రేట్లు- పెరిగాయని వెల్లడించారు. గడ్కరిని హై వై మాన్ ఆఫ్ ఇండియా అంటారని పవన్ కళ్యాణ్ కొనియాడారు.. మన రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో కొండ రహదారుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. అభివృద్ధి పథంలో అందరూ బావుండాలని పీఎం జన్ మన్ పథకంలో అడవి తల్లి బాటలు వేస్తున్నారని చెప్పారు.

# అభివృద్ధికి, నాగరికతకు రహదారులు చిహ్నం

**ప్రపంచస్థాయి లాజిస్టిక్ హబ్‌లు తేవడమే మా లక్ష్యం**

**గడ్కరీ చొరవతో పోలవరానికి నిధులు**

**గడ్కరీ చేపట్టిన అనేక ప్రాజెక్టులు పూర్తి**

**ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**

**అమరావతి :** అభివృద్ధికి, నాగరికతకు రహదారులు చిహ్నమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏపీలో నదులు, కాలువలు పుష్కలంగా ఉన్నాయి. ప్రపంచస్థాయి లాజిస్టిక్ హబ్‌లు తేవడమే మా లక్ష్యం అని అన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చొరవ వల్ల దేశవ్యాప్తంగా రోజుకు 37 కి.మీ పొడవైన హైవే నిర్మాణ ం జరుగుతోందన్నారు. మంగళగిరి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని రూ.5,233 కోట్ల విలువైన జాతీయ రహదారులకు నితిన్ గడ్కరీ, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తలపెట్టిన ప్రతి ప్రాజెక్టును సమర్థంగా పూర్తి చేసిన వ్యక్తి గడ్కరీ అని అన్నారు. ఆయన హయాంలో అనేక జాతీయ రహదారులు పూర్తయ్యాయని చెప్పారు. తొలి పీపీపీ మోడల్ రోడ్డును ముంబయి-పుణె మధ్య నిర్మించినట్లు- గుర్తు చేశారు. తలపెట్టిన ప్రతి ప్రాజెక్టును సమర్థంగా పూర్తి చేసిన వ్యక్తి గడ్కరీ. పోలవరానికి ఆయన ఇచ్చిన అండదండలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. . గడ్కరీకి అంకితభావం, చిత్తశుద్ధి ఎక్కువ. ప్రజా చైతన్యం విషయంలోనూ చొరవ చూపే వ్యక్తి. పొలంలోనే గ్రీన్ హైడ్రోజన్ తయారు చేయాలని చెబుతుంటారు. ఆయన హయాంలోనే సాగర్ మాలా, భారత్ మాలా వచ్చాయి. ప్రపంచంలోనే మెరుగైన రోడ్ల వ్యవస్థ మనదే అవుతుంది. రాష్ట్రానికి మరో 20 పోర్టులు రాబోతున్నాయి. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో పోర్టులు నిర్మిస్తాం. మన రాష్ట్రంలో డ్రై పోర్టులు మరిన్ని వస్తాయి. అమరావతిలో 189 కి.మీ ఓఆర్ఆర్ నిర్మించమని అడిగాను. విశాఖ, విజయవాడకు మెట్రో ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. బయో ఇంధనం ఉత్పత్తిలోనూ వేగంగా చర్యలు తీసుకుంటున్నాం. అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మీదుగా బుల్లెట్ రైళ్లు కావాలి. వీటి ద్వారా 4 కోట్ల మంది ప్రయాణికులకు లబ్ధి జరుగుతుందని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి, నాగరికతకు రహదారులు చిహ్నమని చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. పోలవరానికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అండదండలు ఎప్పటికీ మరిచిపోలేమని నొక్కిచెప్పారు. గడ్కరీ అంకితభావం, చిత్తశుద్ధి చాలా గొప్పవని కొనియాడారు. గడ్కరీ హయాంలో అనేక హైవేలు పూ-ర్తయ్యాయని ప్రశంసించారు. అసాధ్యమను కున్న ప్రాజెక్టులనూ గడ్కరీ పూర్తిచేశారని గుర్తుచేశారు. అపారమైన నీటివనరులు ఏపీ సొంతమని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రపంచస్థాయి లాజిస్టిక్ హబ్స్ తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని చెప్పుకొచ్చా రు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని గుర్తుచేశారు. అమరావతి, హైదరాబాద్, చెన్నై,బెంగళూరు మీదుగా బుల్లెట్ రైళ్లు కావాలని సూచించారు. బుల్లెట్ రైళ్ల ద్వారా నాలుగు కోట్లమంది ప్రయాణికులకు లబ్ధి కలుగుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతిలో 189 కిలోమీటర్ల పొడవైన ఓఆర్ఆర్ అడిగామని తెలిపారు. ఏపీ అడిగిన ప్రాజెక్టులపై గడ్కరీ సానుకూలంగా స్పందించారని.. హైవేల పక్కన పచ్చదనం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో డ్రైవర్లు లేని వాహనాలు వస్తాయని వెల్లడిం చారు. ఏపీకి మరిన్ని డ్రై పోర్టులు రాబోతున్నాయని ప్రకటించారు. బయో ఇంధనం ఉత్పత్తిలోనూ వేగంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



# రోజుకు అసలు ఎన్ని కప్పుల గ్రీన్ టీని తాగాలి..

## ఏ సమయంలో తాగితే మంచిది..?

ఆరోగ్యంగా ఉండాలని చెప్పి ప్రస్తుతం చాలా మంది గ్రీన్ టీని సేవిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది గ్రీన్ టీని అధికంగా తాగుతుంటారు. చైనా సంప్రదాయ వైద్యంలోనూ గ్రీన్ టీని తాగమని సూచిస్తుంటారు. గ్రీన్ టీలో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. గ్రీన్ టీని రోజూ తాగడం వల్ల పలు వ్యాధులు సైతం నయమవుతాయి. అయితే గ్రీన్ టీ తాగుతాం, బాగానే ఉంటుంది, కానీ రోజుకు ఎన్ని కప్పులు తాగాలి, ఏ సమయంలో తాగాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. గ్రీన్ టీ అనేది ఎవరి ఆరోగ్య స్థితిని బట్టి వారు తాగాల్సి ఉంటుంది. కొందరు ఎక్కువ కప్పులు తాగినా పెద్దగా ప్రభావం ఉండదు. కొందరు ఒక కప్పు కూడా తాగలేకపోతారు. కనుక అలాంటి వారు గ్రీన్ టీకి దూరంగా ఉండడమే మంచిది.

**3 కప్పుల వరకు..**

సాధారణంగా ఎవరైనా సరే రోజుకు 1 నుంచి 3 కప్పుల వరకు గ్రీన్ టీని తాగవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల గుండె పోటు రాకుండా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. పలు అధ్యయనాలు చెబుతున్న ప్రకారం రోజుకు 3 కప్పుల వరకు గ్రీన్ టీని సేవిస్తుంటే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని తేలింది. మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఒక కప్పు గ్రీన్ టీలో సాధారణంగా 50 మిల్లీగ్రాముల వరకు కెఫీన్ ఉంటుంది. అమెరికాకు చెందిన ఎఫ్‌డీఏ చెబుతున్న ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 400 మిల్లీగ్రాములకు మించి కెఫీన్‌ను తీసుకోకూడదు. అంటే 8 కప్పుల వరకు గ్రీన్ టీ తాగవచ్చని అర్థం వస్తుంది. కానీ ఒక వ్యక్తి రోజుకు 8 కప్పుల వరకు గ్రీన్ టీని సేవించలేరు. కనుక 3 కప్పులకు పరిమితం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

**ఈ సమయంలో అయితే..**

ఇక గ్రీన్ టీని రోజులో ఏ సమయంలో సేవించాలని కూడా చాలా మంది సందేహిస్తుంటారు. గ్రీన్ టీని ఆహారం తినడానికి 1 గంట ముందు లేదా గంట తరువాత తాగాలి. లేదంటే మనం తిన్న ఆహారంలో ఉండే ఐరన్, విటమిన్ సి వంటి పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకోలేదు. కనుక బ్రేక్ ఫాస్ట్ చేశాక గంట సేపు ఆగి తాగితే మంచిది. మధ్యాహ్నం లంచ్ అయ్యాక 1 గంట విరామం ఇచ్చి కూడా తాగవచ్చు. రాత్రి పూట మాత్రం సేవించకూడదు. ఇందులో ఉండే కెఫీన్ కారణంగా నిద్ర పట్టదు. రాత్రి పూట గ్రీన్ టీని తాగితే నిద్రకు ఆటంకం కలుగుతుంది. ఇలా గ్రీన్ టీని తాగితే అనేక లాభాలను పొందవచ్చు. గ్రీన్ టీని తాగడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించి గుండె పోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా చూస్తాయి.

**లాభాలు ఇవే..**

గ్రీన్ టీలో ఉండే కెఫీన్, ఎల్-థియానైన్ అనే అమైనో యాసిడ్ కారణంగా మెదడు ఉత్తేజంగా మారుతుంది. చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. నిద్ర మత్తు వదిలిపోతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. గ్రీన్ టీని సేవించడం వల్ల మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనే ప్రయత్నంలో ఉంటే రోజూ గ్రీన్ టీని తాగుతుంటే ఫలితం ఉంటుంది. గ్రీన్ టీలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెరిగేలా చేస్తాయి. దీంతో ఎముకలు బలంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. గ్రీన్ టీని సేవించడం వల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియా సైతం నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా గ్రీన్ టీతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# ఐటీ ఉద్యోగుల్లో 84 శాతం మందికి ఫ్యాటీలివర్‌వ్యాధి..

## నివేదికలో సంచలన విషయాలు..

హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగుల్లో 84 శాతం మందికి ఫ్యాటీ లివర్ వ్యాధి ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రి జె.పి. నడ్డా తెలిపారు. ఈ విషయాన్ని ఆయన ఇటీవల లోక్‌సభలో వెల్లడించారు. ప్రత్యేకంగా హైదరాబాదు, బెంగళూరు వంటి ఐటీ హబ్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎక్కువగా ఈ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలుస్తోంది.



ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులలో 71 శాతం మంది ఊబకాయంతో (బరువు ఎక్కువగా ఉండటం) బాధపడుతున్నారు. 34 శాతం మందికు మెటబాలిక్ సింద్రోమ్ అనే ఆరోగ్య సమస్య ఉంది. మెటబాలిక్ సింద్రోమ్ అనేది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీసే పరిస్థితి. ఉదాహరణకు గుండె జబ్బులు, స్ట్రోక్, టైప్ 2 డయాబెటిస్, కాలేయం (లివర్) పాడయ్యే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది.

**కారణాలు ఏమిటి?**

నిపుణుల ప్రకారం, ఈ ఆరోగ్య సమస్యలు రావడానికి ప్రధాన కారణాలు:

ఎక్కువసేపు కూర్చొని పని చేయడం

జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ వంటి ఆరోగ్యానికి హానికరమైన ఆహారం తినడం

అధిక పని ఒత్తిడితో జీవించడం

**ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు:**

ఈ సమస్యను తగ్గించేందుకు ప్రభుత్వం కొన్ని ప్రోగ్రామ్‌లు చేపట్టింది. ముఖ్యంగా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ దీని కింద వివిధ రకాల జాగ్రత్తలు, స్క్రీనింగ్‌లు, అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు. అలాగే, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనే సంస్థ ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారం గురించి అవగాహన పెంచుతుంది. వ్యాయామం, బరువు నియంత్రణ గురించి ప్రచారం చేస్తోంది.

**గ్రామీణ ప్రాంతాలకు ఫ్యాటీ లివర్ వ్యాధి**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం, ఫ్యాటీ లివర్ వ్యాధి ఇప్పటి వరకూ పట్టణాల్లో ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలు, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో కూడా వేగంగా వ్యాపిస్తోంది. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం, దీనిని సమర్థంగా ఎదుర్కొనడానికి రాష్ట్ర స్థాయిలో ఆరోగ్య పరీక్షలకు ప్రాధాన్యత ఇస్తోంది.

**నిపుణుల హెచ్చరిక:**

ఫ్యాటీ లివర్ వ్యాధులు తప్పనిసరిగా శ్రామికశక్తి సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. దీర్ఘకాలంలో దేశ ఆరోగ్య గణాంకాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. కాబట్టి, ప్రజలందరూ కొన్ని జీవనశైలి మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతిరోజూ కొంతసేపు వ్యాయామం చేయాలి

ఆహారపు అలవాట్లపై జాగ్రత్త. మితంగా, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి

**ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి**

ఒత్తిడి తగ్గించుకునే అలవాట్లు ( యోగా, మెడిటేషన్) చేయాలి

ప్రజల ఆరోగ్యం దేశ అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. కాబట్టి, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.ం

# రోజూ డైట్ సోడా తాగుతున్నారా?

## 38% పెరుగుతున్న డయాబెటిస్ రిస్క్ .!



డైట్ సోడాలో సాధారణ సోడాల కంటే తక్కువ కేలరీలు ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి లేదా బరువును నియంత్రించడానికి సహాయపడుతుందని చాలా మంది దీనిని ఎక్కువగా తీసుకుంటారు. అయితే, ఇలా రోజుకు ఒక డైట్ సోడా తాగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 38% పెరుగుతుందని ఆస్ట్రేలియాలో జరిగిన ఒక కొత్త అధ్యయనం కనుగొంది.

కృత్రిమ స్వీటెనర్లతో చేసిన ఈ శీతల పానీయాల వల్ల వచ్చే ప్రమాదం సాధారణ చక్కెర పానీయాల కంటే ఎక్కువగా ఉందని అధ్యయనం చూపిస్తుంది. ఇవి 23% ఎక్కువ ప్రమాదం పెంచే అవకాశం ఉందని తేలింది. ఆస్ట్రేలియాలోని మూడు ముఖ్యమైన సంస్థలు నిర్వహించిన ఈ అధ్యయనంలో 40-69 సంవత్సరాల వయస్సు గల 36,000 మందిని దాదాపు 14 సంవత్సరాల పాటు పరిశోధన చేశారు. అంటే ఎప్పటికప్పుడు వారి ఆహారం, వ్యాయామం, ఆరోగ్య పరిస్థితులు, జీవనశైలి మార్పులు ఎలా ఉన్నాయో రికార్డ్ చేశారు. ఈ పరిశోధనలో స్వీట్ డ్రింక్స్, కృత్రిమ స్వీటెనర్లతో చేసిన డైట్ డ్రింక్స్ ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపిస్తాయనే విషయం పరిశీలించారు.

**ప్రధాన విషయాలు:**

డైట్ డ్రింక్స్ మనం అనుకుంటున్నట్టు స్వీట్ డ్రింక్స్‌కు సురక్షితమైన ప్రత్యామ్నాయం కాదని ఈ పరిశోధనలో తేలింది. ప్రతి రోజు ఒకటి లేదా అంతకంటే ఎక్కువగా డైట్ డ్రింక్స్ తాగడం వల్ల, టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. టైప్ 2 డయాబెటిస్ ప్రపంచవ్యాప్తంగా 1.3 మిలియన్ల మంది ఆస్ట్రేలియన్లను, 500 మిలియన్లకు పైగా ప్రజలను ప్రభావితం చేస్తుంది. వీటిలో ఎక్కువ కేసులు ఆహారం, జీవనశైలితో ముడిపడి ఉన్నాయి. కాబట్టి, డైట్ డ్రింక్స్ తాగడం కూడా పూర్తిగా సురక్షితం కాదని ఈ అధ్యయనం స్పష్టం చేస్తుంది.

డైట్ సోడా తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, వీటిలో టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బులు, మెటబాలిక్ సింద్రోమ్, మరికొన్ని ఉన్నాయని తేలింది. డైట్ సోడాలో కృత్రిమ స్వీటెనర్లు ఉంటాయి కాబట్టి ఇవి ఆరోగ్యానికి హానికరమని నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనుకునే వారు కృత్రిమంగా చేసిన ఈ డైట్ సోడా తాగి ఇతర ఆరోగ్య సమస్యలు తెచ్చుకునే కంటే సహజమైన పానీయాలు తాగడం సురక్షితమని నిపుణులు సూచిస్తున్నారు.

# ఈ కాయలను ఎప్పుడైనా చూశారా..

## కనిపిస్తే విడిచిపెట్టకుండా తినండి.. ఎందుకంటే..?

మార్కెట్‌లో లేదా బయట బండ్లపై మనకు అప్పుడప్పుడు పలు చిత్రమైన పండ్లు దర్శనమిస్తుంటాయి. అలాంటి పండ్లు ఉంటాయని కూడా చాలా మందికి తెలియదు. అలాంటి వాటిల్లో వాక్కాయలు కూడా ఒకటి. వీటినే కరోండా పండ్లని కూడా పిలుస్తారు. ఇవి పులుపు, తీపి రుచుల్లో ఉంటాయి. మార్కెట్‌లో ఈ పండ్లను చాలా మంది చూసే ఉంటారు, కానీ ఇవే వాక్కాయలని చాలా మందికి తెలియదు. ఈ కాయలు పచ్చిగా ఉన్నప్పుడు కొందరు ఊరగాయ పచ్చడి కూడా పెడుతుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి వాక్కాయలు అంటే బాగా పరిచయం ఉంటుంది. అయితే ఈ కాయలు పండ్లుగా మారినప్పుడు తినాలి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. వాక్కాయలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ కాయలను తింటే పలు వ్యాధులు కూడా నయమవుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.



**రోగ నిరోధక శక్తికి..**

వాక్కాయల్లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. దీంతో రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లలో విటమిన్ ఎ కూడా అధికంగానే ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరచడంతోపాటు రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. ఈ కాయల్లో క్యాల్షియం, ఐరన్, మెగ్నిషియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి అనేక శరీర జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు సహాయం అందిస్తాయి. ఈ కాయలను తినడం వల్ల ఎముకలు పటిష్టంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. కండరాలు నిర్మాణమవుతాయి. కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వీటిల్లో ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు, ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

**ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ..**

వాక్కాయల్లో ఉండే విటమిన్ సి మన శరీరంలో తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా వచ్చే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. తరచూ ఈ కాయలను తింటుంటే సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ కాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో సుఖ విరేచనం అవుతుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడుతున్నవారు ఈ కాయలను తింటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. ఈ కాయలు ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. అందువల్ల వీటిని తింటే జీర్ణవ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**గుండె ఆరోగ్యానికి..**

వాక్కాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. ఈ కాయల్లో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు ఈ కాయలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. షుగర్ ఉన్నవారికి కూడా ఇవి మేలు చేస్తాయి. వీటిని తింటే ఇన్సులిన్ ను శరీరం మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. మానసిక ఆరోగ్యానికి కూడా వాక్కాయలు మేలు చేస్తాయి. ఈ కాయలను తింటుంటే శరీరానికి మెగ్నిషియం లభిస్తుంది. ట్రిప్టోఫాన్ విడుదలయ్యేలా చేస్తుంది. ఇది సెరొటోనిన్ స్థాయిలను పెంచుతుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గి మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇలా వాక్కాయలను తరచూ తింటుంటే ఎన్నో లాభాలను పొందవచ్చు.

# క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

**స్థానిక సమస్యలపై ఎక్కడికక్కడ పోరాడాలి**

**ఎంసిపిఐ(యు) నగర కమిటీ సమావేశంలో**

**జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**



**వరంగల్, ఆగస్టు 3(సమయం న్యూస్):** ప్రజల ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై ఎక్కడికక్కడ ప్రజా పోరాటాలను నిర్మించి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. శనివారం ఎంసీపీఐ(యు) నగర కమిటీ సమావేశం కామ్రేడ్ సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన స్థానిక ఓంకార్ భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక ఆశాజనకమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారని రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారు తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఈ క్రమంలో పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో పాటు స్థానికంగా మౌలిక సదుపాయాలు లేక పేద మధ్యతరగతి ప్రజానీకం అనేక అవస్థలు పడుతున్నారని జనాభాపరంగా విపరీతంగా వరంగల్ నగరం పెరుగుతున్న అందుకు అనుగుణంగా కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకుల వైఫల్యం స్పష్టంగా కనబడుతున్నదని ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్కడికక్కడ ప్రజా ఉద్యమాలను నిర్మించి సమస్యల పరిష్కారానికి బాటలు వేయాలని ఈ క్రమంలో పార్టీ విస్తరణకు బలమైన నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ నగర కార్యదర్శి మాలోతు సాగర్ మాట్లాడుతూ వరంగల్ నగరంలోని అన్ని డివిజన్లో సమస్యలపై అధ్యయనం చేసి సమస్యల వారిగా పోరాటాలను రూపొందించుకోవాలని అందులో భాగంగా పార్టీ ఏరియా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు, నగర సమగ్ర అభివృద్ధి కోసం పోరాటాల నిర్మాణానికి ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాల రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి ఎగ్గని మల్లికార్జున్ ఐతం నాగేష్ మాలోత్ ప్రత్యూష తాటికాయల రత్నం గణిపాక ఓదేలు పరిమళ గోవర్ధన్ రాజు మహమ్మద్ మహబూబ్ పాషా రాయినేని ఐలయ్య నలివెల రవి మాధవి రామస్వామి దాసరపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే చెల్లించాలి




**బాన్సువాడ, ఆగస్టు 3:** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు డిమాండ్ చేశారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం రెండో రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దుబాస్ రాములు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న మొత్తం బిల్లులను కార్మికులకు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు పది వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు ఆ హామీని విస్మరించిందని విమర్శించారు. శిథిలావస్థలో ఉన్న వంటశాలలను వెంటనే మరమ్మతులు చేసి, వంట పాత్రలు సరఫరా చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బాన్సువాడ డివిజన్ కార్యదర్శి శంకర్, అంజవ్వ, సుజాత, నాగమణి, లక్ష్మి, నజిమాబి, చియా బేగం, సోఫియా బేగం, మంద శంకర్, సాయిలు, పాషా తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకులు

**ఆహ్వానించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**మేడ్చల్ మల్కాజిగిరి, ఆగస్టు 2(సమయం న్యూస్):** మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వెంకటేష్, శ్రీనివాస్ కపూర్, సురేష్, సాంబ, శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ "రాబోయేది మన ప్రభుత్వమే. ప్రజల మద్దతుతో మరింత బలోపేతమైన బిఆర్ఎస్ ను నిర్మిద్దాం. ప్రజల కోసం కష్టపడి పని చేయండి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




**వరంగల్, ఆగస్టు 2(సమయం న్యూస్):** వరంగల్20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కూతురి వివాహం శనివారం జరుగగా, గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ చైర్మన్ టి. రమేష్ బాబు, మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, మాజీ ఆర్టిఏ మెంబర్, గోరంట్ల మనోహర్, కంచె సంపత్, 19 డివిజన్ యువజన నాయకులు చిలువేరు పవన్, 20 డివిజన్ యువజన నాయకులు ఇక్బాల్, 32 డివిజన్ అధ్యక్షులు పాగాకు సందీప్, యువజన నాయకులు చిమ్మని సంతోష్, అమరీష్, రాజు పటేల్, యుగేందర్, కాశిబుగ్గ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్పల్లి, ఇందల్వాయిల్లో కలెక్టర్ తనిఖీలు

**నిజామాబాద్, ఆగస్టు 02( సమయం న్యూస్)** ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధర్పల్లి మండలం ఒన్నాజిపేట్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి సెంటర్, ఎరువుల గోడౌన్ లను కలెక్టర్ సందర్శించారు. అలాగే, ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో గల అంగన్వాడి కేంద్రాలను, సహకార సంఘం ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేశారు. పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది హాజరును పేస్ రికగ్నేషన్ విధానం (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా చేపడుతున్నారా అని ఆరా తీశారు. విద్యార్థుల ప్రవేశాలు, హాజరవుతున్న వారి సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఎల్లారెడ్డిపల్లిలో ఒకే ప్రాంగణంలో మూడు అంగన్వాడి కేంద్రాలు కొనసాగుతుండడాన్ని గమనించిన కలెక్టర్, ఎందుకు ఒకేచోట నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు పంపేందుకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తూ, ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలను నిర్వహించాలని అంగన్వాడి టీచర్ రజితను ఆదేశించారు. కాగా, ఎల్లారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతి గురించి పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులు అందరూ ఇంటి నిర్మాణం చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.





# సీఎంఆర్ఎఫ్‌చెక్కుల పంపిణీ

**మేడ్చల్ మల్కాజిగిరి, ఆగస్టు 2 (సమయం న్యూస్):** మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్‌చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత, మాజీ కార్పొరేటర్ మురుగేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అమినుద్దీన్, మేకల రాము యాదవ్, సత్యనారాణ, రాజశేఖర్, నవాబ్ దినేష్, రాజు, కాశి యాదవ్, జంగా రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల సంరక్షణపై సమీక్ష



**మేడ్చల్ మల్కాజిగిరి, ఆగస్టు2 (సమయం న్యూస్ ):** మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన మల్కాజ్గిరి శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి, బండ చెరువులోకి మురుగునీరు చేరకుండా నిరోధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బండ చెరువులోకి పరిసర కాలనీల నుండి మురుగునీరు ప్రవాహం చెందుతుండటంతో చెరువు దోమల నిలయంగా మారిందని, ఇది ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతుందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. అలైన్మెంట్ పైపులైన్ కోసం అవసరమైన భూభాగం స్థానిక భూయజమానుల స్వాధీనం కావడంతో, వారి అంగీకారం తీసుకోవడానికి చర్చలు జరిపి, త్వరితగతిన పనులు ప్రారంభించాలన్నారు. సంబంధిత ప్రపోజల్స్‌ను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా చిన్న రాయిని చెరువు వద్ద అలుగు వంతెన (బ్రిడ్జ్) నిర్మించాలనే స్థానికుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని, ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాలంటూ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీ శుక్లజ్, ఏఈ శ్రీధర్, మణికంఠ, బి ఆర్ ఎస్ నాయకులు అమీనుద్దీన్, భూయజమానురాలు ప్రతిభ, కృష్ణ కుమార్, అల్వాల్ వాసులు లక్ష్మణరావు, పెద్ది రమేష్, సురేందర్ రెడ్డి, నాగరాజు, పీ బీ చారి తదితరులు పాల్గొన్నారు.

# లెక్చరర్ పార్థివ దేహానికి నివాళులు



**వరంగల్, ఆగస్టు 2:** పర్వతగిరి మండలం పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన లెక్చరర్‌పిండి తిరుమలేష్ మరణించగా వారి పార్థివదేహానికి పర్వతగిరి సొసైటీ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్, పర్వతగిరి మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట మాజీ సర్పంచులు కొల్లూరి వెంకటేశ్వర్లు, ఏర్పుల శ్రీనివాస్, బండి సంతోష్, ఇస్లావత్ బిక్య నాయక్, ముంజ శ్రవణ్ గౌడ్, ఎర్రబెల్లి హరీకుమార్, గడ్డి యాకయ్య, ముంజల రాజు(ఈనాడు విలేకర్), రాజేంద్ర చారి, జావీద్ అలీ , గుగులోత్ వీరన్న మాజీ వార్డు సభ్యులు) , అజ్మీర మోహన్, కుంట మధుకర్, దోనికి రవి,శ్రీరాముల కిరణ్, యూత్ సోషల్ మీడియా చిన్నపెల్లి అజయ్ తదితరులు ఉన్నారు.



హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కను గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సంజీవరావు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రాజకీయాల గురించి చర్చించారు.

\- సమయం న్యూస్, వరంగల్



# దౌల్తాబాద్ వేంకటేశ్వర దేవాలయ అభివృద్ధికి ప్రతిపాదనలు

## దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్

**దౌల్తాబాద్, ఆగస్ట్ 2: (సమయం న్యూస్) :** దౌల్తాబాద్ వెంకటేశ్వర దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్ అన్నారు. శనివారం కొడంగల్ నియోజకవర్గంలో దేవాలయ శాఖ కమిషనర్ వెంకట్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలిసి కొడంగల్, దౌల్తాబాద్ లలో గల వెంకటేశ్వర దేవాలయాలను రాష్ట్ర దేవాలయ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దేవాలయ నిర్మాణానికి నిధులను కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేయగా.. తమ సూచనల మేరకు ప్రతిపాదన ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ సెక్రటరీ మాట్లాడుతూ... దేవాలయ ప్రాంగణం భక్తులకు ఎంతగానో ఆహ్లాదాన్ని కల్పించే విధంగా ఉందని, ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకుంటే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. దేవాలయానికి ఆనుకుని ఉన్న చెరువులో బోటింగ్ చేసేందుకు అదేవిధంగా పార్కును ఏర్పాటు వల్ల ప్రజలకు వినోదంతో గడిపేందుకు ఎంతగానో తోడ్పడుతుంద ఆమె అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి లు ఉన్నారు.

# బ్యాంకు ఖాతాలో నుండి డబ్బు మాయం

**రాయపోల్, ఆగస్టు2:** సిద్దిపేట జిల్లాలోని రాయపోల్ మండలం సయ్యద్ నగర్ లో ఓ మహిళ బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైంది. వివరాల ప్రకారం మండల లోని సయ్యద్ నగర్ గ్రామానికి చెందిన అలీ బిబి ఖాతాలో రూ.2 లక్షల 39వేలు నగదును సైబర్ నేరగాళ్లు మాయం చేశారు.దీంతో బాధితుడు సైబర్ క్రైమ్,పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళ్తే సయ్యద్ నగర్ కు చెందిన అలీ బిబి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటుంది.భర్త అలీ హుస్సేన్ దుబాయిలో డ్రైవర్గా పనిచేస్తున్నాడు. వీరికి ఒక కొడుకు అజ్మోద్దీన్ ఉన్నాడు. దుబాయ్ లో ఉన్న అలీ హుస్సేన్ అక్కడ పని చేస్తూ డబ్బులను భార్య అలీ బీబీ ఖాతాలో జమ చేసేవాడు. ఇరువురి బ్యాంక్ ఖాతాలకు అజ్మోద్దీన్ ఫోనెంబర్ లింక్ అయ్యి ఉండగా ఫోన్ పే,గూగుల్ పే ద్వారా ఇంటి అవసరాలకు వాడుతునేవాడు. రెండు రోజుల క్రితం అజ్మోద్దీన్ ఇంస్టాగ్రామ్ లో వీడియోలు చూస్తూ ఉండగా ఒక వీడియోలో డ్రోన్ కెమెరా అమ్మబడును అని క్రింద ఫోన్ నెంబర్ రాసి ఉంది. అతడు ఆ నెంబర్ కి ఫోన్ చేసి డ్రోన్ కెమెరా కావాలని అడగడంతో ఆ వ్యక్తి డబ్బులు పంపితే కెమెరా పంపిస్తామని చెప్పాడు. దీంతో అజ్మోద్దీన్ రూ.50 వేలు పంపాడు. రెండు రోజులు 31,1 తేదీలలో పలుమార్లు ఫోన్ పే ద్వారా పంపుతూ రూ.2 లక్షల 39 వేల వరకు పోగొట్టుకున్నారు. ఖాతా మొత్తం ఖాళీ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న అజుముద్దీన్ మామ అబ్బర్ శనివారం రాయపోల్ ఎస్సై మానస సంప్రదించి ఫిర్యాదు చేశాడు. ఎస్సై కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

# పొలాల మట్టి నమూనాల సేకరణ



**కొడంగల్, ఆగస్టు 2 (సమయం న్యూస్):** కొడంగల్ మండలానికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద 550 సాయిల్‌హెల్త్‌కార్డులు కేటాయించగా, 425 కొడంగల్ క్లస్టర్ (సాయిల్‌హెల్త్‌అండ్‌ఫెర్టిలిటీ స్కీం), 125 – పర్సాపూర్ క్లస్టర్ (నేచర్‌ఫార్మింగ్ స్కీం) కార్డుల కోసం రైతు పొలాల నుంచి అధికారులు మట్టి నమూనాలను శనివారం సేకరించారు. వీటిని రాజేంద్రనగర్‌లో ఉన్న భూసార పరీక్ష కేంద్రానికి పంపిస్తామని మండల వ్యవసాయ అధికారి జి.తులసి తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని క్లస్టర్ల ఏఈవోలు రాజు, అశ్విని, ఇసాక్ హెరాల్డ్, శ్రీపతి, సుమ, రైతులు పాల్గొన్నారు.

# 7న గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశం

**ఖమ్మం ఆగస్ట్ 2 (సమయం న్యూస్):** గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆగస్టు 7న ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మ గుడి సమీపంలో గల దృశ్యంత రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి ఏవి చారి లు శని వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశం లో సీజన్ వ్యాధులపై అవగాహన , గ్రామీణ వైద్యుల పై టీజీఎంసి దాడులపై సదస్సు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారావు వెంకట చారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఉంటాయని ప్రకటించారు. కార్యక్రమం అనంతరం ముఖ్యులకు, మండల అధ్యక్షులకు సన్మానం తలపెట్టినట్లు చెప్పారు. కార్యక్రమం గంట ముందు గ్రామీణ వైద్యులు తమ పేరులను నమోదు చేయించుకొని , సమావేశంను జయప్రదం చేయాలని తమ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలి

## • మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**వెల్దుర్తి ఆగస్టు 02,(సమయం న్యూస్):** వెల్దుర్తి మండలం ఎద్దులపల్లి గ్రామంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్, కందడి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో 150 మంది యువకులు బిజెపిలో చేరిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెదక్ ఎంపీ రఘు నందన్ రావు. శనివారం వెల్దుర్తి మండలం ఎద్దులపల్లి గ్రామంలో బిజెపి పార్టీలో చేరికల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రఘునందన్ రావు మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పరిపాలన చేసిన వెల్దుర్తి మండలంలోని ఎద్దులపల్లి గ్రామానికి ఏ దిక్కు చూసినా రోడ్డు లేకపోవడం సిగ్గుచేటని మెదక్ ఎంపీ రఘు నందన్ రావు,గత బి ఆర్ ఎస్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పై మండిపడ్డారు. గతంలో సర్పంచులు వాళ్లే ఎంపీటీసీలు ఎమ్మెల్యేలు మంత్రులు కూడా వాళ్ళె ఉండి కనీసం మెదక్ జిల్లా కేంద్రానికి వెల్దుర్తి మండలం నుంచి డబల్ రోడ్డును వేయకపోవడం ఎంత సిగ్గుచేటని రఘునందన్ రావు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆరు గ్యారంటీలతో, 420 హామీలతో ప్రజలను ఆదుకుంటామని కాంగ్రెస్ మాయమాటలు, అబద్ధాలు చెప్పి ప్రజానీకాన్ని మోసం చేసి 18 నెలలు గడుస్తున్న కాలక్షేపం తప్ప ప్రజలకు చేసింది ఏం లేదని ఎద్దేవా చేశారు. మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్నిసార్లు మెదక్ వచ్చిన, వెల్దుర్తి మెదక్ రోడ్డును మంజూరు చేయకపోవడంపై ఇదేనా మీ ప్రజా పాలన అంటూ మండిపడ్డారు. వెల్దుర్తి మండల వాళ్ళు ఎక్కడ కలిసినా మాకు రెండు బస్సులు వెల్దుర్తి,మెదక్ రోడ్డు మంజూరు చేయించాలని పదేపదే అడగడంతో ఈరోజు మారుమూలన ఈ గ్రామానికి విచ్చేసి గ్రామస్తులు ముందర చెప్తున్నాను ఆరు నూరైనా ఈ గ్రామానికి రోడ్డు మంజూరు చేయించి త్వరలోనే మళ్లీ వస్తానని అన్నారు. ప్రస్తుతం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం మళ్లీ కాంగ్రెస్ సర్కార్ లబ్ధి పొందడానికి కుటిలప్రయత్నాలు, రాజకీయాలు మొదలుపెట్టిందన్నారు. మీరు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా గ్రామాల్లో ప్రజలు మిమ్మల్ని నమ్మేటట్లు లేరని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా నాయకుడు మురళి యాదవ్ , పాప గారి రమేష్ గౌడ్, వెల్దుర్తి మండల బిజెపి అధ్యక్షుడు దాసు, మండల ఉపాధ్యక్షుడు బాలకిషన్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు చెంది నర్సింలు కర్ర వెంకటేశం, నాయకులు శివ, హనుమాద్రి శ్రీధర్ గౌడ్, శేఖర్ గౌడ్, నవీన్ పటేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్జీపీఏటీల సమస్యల పరిష్కారానికి ఛలో హైదరాబాద్



**వరంగల్, వరంగల్(సమయం):** స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ(ఎస్జీపీఏటీ) వరంగల్ జిల్లాశాఖ జనరల్ కౌన్సిలింగ్ సమావేశం కర్రు సుధీర్ బాబు అధ్యక్షతన ఇన్నర్ వీల్ ఫంక్షన్ హాలు కొత్తవాడ వరంగల్ లో శనివారం నిర్వహించారు. పెన్షనర్ల సమస్యలు, ఈహెచ్ఎస్, డీఆర్, సీపీఆర్సీ వెంటనే 10 ఆగస్టు వరకు పరిష్కరించాల్సినదిగా రాష్ర ప్రభుత్వన్ని కోరారు. లేనియెడల మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టాల్సిందిగా కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో ఎస్జీపీఏటీ నూతన కార్యవర్గం ఎన్నికల అధికారులుగా విచ్చేసిన డాక్టర్‌వెంగళరెడ్డి, డాక్టర్‌మార్క శంకరనారాయణ, పరిశీలకులుగా పరుశ పుల్లయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వీరస్వామి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తుమ్మ వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా జి సాంభయ్య, కోశాధి కారిగా నిమ్మకాయల సదానందం, అసోసియేట్ అధ్యక్షులుగా పి. పరమేశ్వర్, ఉపాధ్యక్షులుగా కె.వీరస్వామి, ఎ. వనజ, యం.డి. మహినోద్దీన్, డాక్టర్ వెంకటనారాయణ, పి.పెద్దన్న, జి. నర్సింహారాములు, యం.డి. మహబూబ్‌అలీ, కార్యదర్శులుగా యస్.రాజయ్య, సారంగపాణి, బిక్షపతి, సరస్వతీ, విజయకుమార్, కుసుమ మధుసూధన్ రావు, జి.కామేశ్వర్. ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జి హరిప్రసాద్, కె. కుమారస్వామి, రమేష్, వీరస్వామి, సత్యనారాయణ, సారంగపాణి, షర్ఫుద్దీన్, అడ్వైజర్స్ గా జి.ప్రతాప రెడ్డి, యుగేందర్, రాంచందర్. ఈసీ మెంబర్స్ గా వి.రవీందర్, వీరభద్రం, కె.వేణుగోపాల్, కె. డానియల్, జి. కాంతయ్య, బొమ్మ రఘుపతి ఎన్నికయ్యారు. వందన సమర్పణతో కార్యక్రమం ముగిసినది.

# ఆదివాసీల చరిత్రపై ఇలవేల్పుల గ్రంథం రూపకల్పన

## ఐటీడీఏ పీవో రాహుల్



**ఆగస్టు 2 , భద్రాద్రి కొత్తగూడెం ( సమయం న్యూస్):** ఆదివాసి గిరిజన తెగలకు సంబంధించిన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, అంతరించిపోకుండా నేటి తరానికి మరియు ముందు తరాల యువతీ యువకులు తెలుసుకునే విధంగా ఇలవేల్పుల గ్రంధాన్ని రూపొందిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శనివారం నాడు ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సి భవనంలోని సమావేశ మందిరంలో ఆదివాసి కోయ ఇలవేల్పుల చరిత్ర, సాంస్కృతి సాంప్రదాయాల గ్రంథస్థం కొరకు తలపతులు మరియు ఆర్తి బిడ్డలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆర్తి బిడ్డలు, తలపతులు వారి సాంప్రదాయం మరియు ఇలవేల్పుల కట్టుబాట్లు, ఆచార వ్యవహారాల గురించి వివరించిన అంశాలను ఆయన పూర్తిగా అవగాహన చేసుకున్న అనంతరం మాట్లాడుతూ వర్తమాన కాలాన్ని దృష్టిలో పెట్టుకొని రాబోయే తరానికి ఆదివాసుల చరిత్ర పూర్తిస్థాయిలో తెలుసుకోవడానికి అలాగే మన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, పూజా విధానం అంతరించిపోకుండా నేటి తరానికి ముందు తరాలకు మరియు ఖండాంతరాలకు తెలిసే విధంగా 5 గోత్రాలు మరియు ఇలవేల్పులకు సంబంధించిన తలపతులను, ఆర్తి బిడ్డలను బృందాలుగా ఏర్పాటు చేసి మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో ఇలవేల్పులకు సంబంధించిన పూర్తి చరిత్రను సేకరించడం జరిగిందని, ఒక్కొక్క ఆదివాసి తెగలకు సంబంధించిన గిరిజనుల ఆచార వ్యవహారాలు, పండుగలు మరియు పూజా విధానము, ఆహార నియమాలు అన్ని క్రోడీకరించి గిరిజన తెగల పాతతరం పెద్దమనుషులను సంప్రదించి సేకరించడం జరిగిందని అన్నారు. ఈ ఐదు బృందాలు సేకరించిన ఇలవేల్పుల చరిత్రను వివిధ తెగల తలపతులకు, ఆర్తి బిడ్డలకు విపులంగా వివరిస్తారని, వారి ఇలవేల్పులకు సంబంధించిన చరిత్ర కచ్చితంగా ఉన్నది లేనిది తెలియజేయాలని, తలపతులు సూచించిన విధంగానే ఈ యొక్క గ్రంధాన్ని రూపొందిస్తామని ఏమైనా తప్పులుంటే సరిదిద్దుతామని అన్నారు. ఈ ఇలవేల్పుల చరిత్రను వెయ్యి సంవత్సరాల వరకు అయినా చెక్కుచెదరకుండా జాగ్రత్త పరచడానికి ప్రయత్నిస్తున్నామని, ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఓ రమేష్, రిటైర్డ్ ఏసిఎంఓ రమణయ్య, మ్యూజియం ఇంచార్జ్ వీరాస్వామి, తలపతులు మరియు ఆర్తి బిడ్డల సంఘ నాయకులు జగపతిరావు, కోటేశ్వరరావు, చలపతిరావు, పోషాలు, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, కొత్తగూడెం జిల్లాల తలపతులు, ఆర్తి బిడ్డలు తదితరులు పాల్గొన్నారు.

# 5 నుంచి 8 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపు

**పెద్దపల్లి, ఆగస్టు 2 (సమయం న్యూస్):** ఆగస్టు 5 నుంచి 8 వరకు కలెక్టరేట్ ఆవరణ లో ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డు కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక క్యాంపులో నూతన ఆధార్ కార్డు ఎన్ రోల్ మెంట్ ఉచితంగా జరుగుతుందని అన్నారు. బయోమెట్రిక్ అప్ డేషన్ (ఫింగర్ ప్రింట్,ఐరిస్, ఫోటో) చేయడానికి 100 రూపాయల రుసుం మరియు డేమోగ్రాఫిక్ అప్ డేషన్ బయోమెట్రిక్ అప్ డేట్ తో కలిసి చేస్తే ఉచితంగా ఉంటుందని, ప్రత్యేకంగా డేమోగ్రాఫిక్ అప్ డేషన్(అడ్రస్,మొబైల్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, పేరు...) 50 రూపాయల రుసుము చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా ఆధార్ కార్డు పొందేందుకు కావాల్సిన ధృవ పత్రములు మీసేవ ద్వారా అడ్రస్ తో జారీ చేయబడిన బర్త్ సర్టిఫికెట్ , తల్లి లేదా తండ్రి అప్ డేట్ చేసిన ఆధార్ కార్డు మరియు ఆధార్ కార్డులో




అడ్రస్ మార్పు కోసం ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా నివాస సర్టిఫికెట్, బ్యాంకు పుస్తకం/ పోస్టల్ బుక్ తో సహా అటెస్టడ్ దరఖాస్తు ఫారం ఉండాలని, ఆధార్ కార్డు లో పేరు అక్షరాల సవరణ,పొరపాట్ల సవరణకు ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా పాన్ కార్డు లేదా ఎస్.ఎస్.సి మార్కుల మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేదా మైనర్ ఐతే బర్త్ సర్టిఫికెట్ ఉండాలని, పెళ్లి తర్వాత పేరు మార్పు కోసం సబ్ రిజిస్టర్ జారీ చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్ , పెళ్లి ఫోటో, ఇతర గుర్తింపు కార్డులు ఉండాలని, పూర్తిగా పేరు మార్పు కోసం గెజిట్ (%+ఘఓవ్వ%) చేసి ఉండాలని,ఆధార్ కార్డు లో డేట్ అఫ్ బర్త్ కరెక్షన్ కోసం బర్త్ సర్టిఫికెట్ , 21 సంవత్సరాల పైబడిన వారికి ఫోటో తో కూడిన మార్కుల మెమో లేదా ఇండియన్ పాస్ పోర్ట్ ఉండాలని అన్నారు. ఆధార్ కార్డు లో సవరణలు లేదా కొత్త ఆధార్ కార్డు దరఖాస్తు కొరకు తమ ఒరిజినల్ ధృవ పత్రములు తప్పనిసరిగా తీసుకొని రావాలని, కలెక్టరేట్ లో ఏర్పాటు చేసే ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డు ను ప్రజలు, ఉద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# స్థానిక ప్రజా ప్రతినిధులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

## జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



**పటాన్ చెరు(అమీన్ పూర్),ఆగస్టు 2, సమయం న్యూస్:** స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా అమీన్ పూర్ మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో మున్సిపల్ ఆఫీస్ ను ముట్టడి చేస్తామని జిల్లా బిజెపి అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మండలంలోని పటేల్ గూడా కృష్ణారెడ్డిపేట గ్రామ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు అమీన్ పూర్ మున్సిపాలిటీలో కలిపిన కొత్త గ్రామాల అభివృద్ధి పై దృష్టి పెట్టాలని ఆమె అన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడి చేస్తామని, జిల్లా స్థాయిలో కూడా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె అన్నారు. ఇప్పటివరకు ఎంపీ రఘునందన్ రావు ఎమ్మెల్సీ అంజిరెడ్డి నిధులతో అమీన్ పూర్ లోని కొన్ని కాలనీలలో అభివృద్ధి పనులను జరిపించామని వారు తెలిపారు. రాబోయే రోజుల్లో పఠాన్ చెరువు ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయడం తద్యమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, అమీన్ పూర్ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు వివిధ కాలనీలో ప్రెసిడెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




# వరదలు వస్తే రంగంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

## ● ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**భద్రాచలం ,ఆగస్ట్ 25 ( సమయం న్యూస్):** గోదావరి వరదల సమయంలో ముంపునకు గురి అయ్యే మండలాల్లోని ప్రజలు అకస్మాత్తుగా వరదలు పెరిగినప్పుడు పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకుపోతే వెంటనే ఎన్ డి ఆర్ ఎఫ్ బృందంను రంగము లోకి దించి సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అవకాశం కలుగుతుందని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం సబ్ కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ విపత్తుల స్పందన దళం సారధ్యంలో గోదావరి వరదల సమయంలో భద్రాచలం, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాలలోని ముంపునకు గురి అయ్యే ప్రాంతములోని ప్రజలకు పోలీస్, రెవెన్యూ సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలపై, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు తో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరదలకు ముంపునకు గురి అయ్యే మండలాలు మరియు గ్రామాలలో వరదలు ఎక్కువైనప్పుడు ప్రజలు పై అధికారుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. అనుకోకుండా గోదావరి వరదకు కొట్టుకు పోయేటప్పుడు లైఫ్ జాకెట్లు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలి రావచ్చని ఆయన అన్నారు. అలాగే గ్రామాలలో వాగులు, వంకలు పొంగుతూ ఉంటాయని, వాగు దాటేటప్పుడు ముంపు ప్రాంతాల ప్రజలు ఎవరైనా తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించి వాగులు దాటాలని అన్నారు. గోదావరి వరదల సమయంలో తీసుకోవలసిన రక్షణ చర్యలపై ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం డెమో ద్వారా తప్పనిసరిగా గ్రామాలలోని ప్రజలకు సలహాలు సూచనలు ఇవ్వాలని ఆయన అన్నారు. గ్రామాలలోని మనసులు కానీ, పశువులు కానీ నీటిలో కొట్టుకుపోతూ ఉంటే ప్రాణ నష్టం జరగకుండా చూడవలసిన బాధ్యత రెవెన్యూ, పోలీస్ ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం పైన ఉందని, గ్రామంలోని ప్రజలకు తప్పనిసరిగా వరదల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేస్తూ ఉండాలని ఆయన అన్నారు. ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురైన ప్రజలకు సిపిఆర్ ద్వారా ప్రాణ నష్టం జరగకుండా చూడవచ్చని సిపిఆర్ కి సంబంధించిన అవగాహన కూడా ప్రజలకు తెలియజేయాలని ఆయన అన్నారు. అనంతరం వరదలలో కొట్టుకుపోయిన మనుషులను ఏ విధంగా కాపాడాలో డెమో ద్వారా ప్రాక్టికల్ గా ఎన్డీఆర్ బృందం సమావేశానికి వచ్చిన అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిటి ధనియాల వెంకటేశ్వరరావు ఎన్ డి ఆర్ ఎఫ్ టెన్త్ బెటాలియన్ డిఎఫ్ఓలు ఇమజ్, కోటేశ్వరరావు, మంగరాజు, నరేందర్ మరియు రెవెన్యూ, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# మీనాక్షి నటరాజన్‌ను కలిసి కొల్యూరి



**పటాన్ చెరు, ఆగస్టు 2 (సమయం):** సంగారెడ్డి జిల్లాలో ప్రజా జనహిత పాదయాత్రలో భాగంగా పర్యటిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం, సంగారెడ్డి జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కొల్యూరి నరసింహారెడ్డి శనివారం కలిశారు. పటన్‌చెరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో జనహిత ప్రజా పాదయాత్రలో భాగంగా జోగిపేట పట్టణంలో ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి రాజన్ ను కలిసామని తెలిపారు. పాదయాత్ర ద్వారా సామాన్య కాంగ్రెస్ కార్యకర్తకు మనోధైర్యాన్ని నింపుతున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఆర్టీసీ బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాల ద్వారా ప్రజలలో ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందని అన్నారు. వంటగ్యాస్ సిలిండర్ సబ్సిడీ రూపాయలు నేరుగా లబ్ధిదారునికి అందే విధంగా చూడాలని వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ఐదు లక్షల ఇన్సూరెన్స్ ను అమలు చేయాలని వారు సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్తలకు ఇన్సూరెన్స్ త్వరగా అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు, ఉస్మాన్ సాగర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రవి గౌడ్, నావారి శ్రీనివాస్ రెడ్డి, తులసీదాస్ ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేయాలి

## టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్



**రాయపోల్,ఆగస్టు 2:** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. శనివారం రాయపోల్ మండలం వీరానగర్, వీరారెడ్డిపల్లి,వడ్డేపల్లి, బేగంపేట,సయ్యద్ నగర్, రాంసాగర్,కొత్తపల్లి, రాయపోల్, అనాజీపూర్ పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు చేసి పైరవీలకు తావు లేకుండా కౌన్సిలింగ్ సిస్టం తీసుకురావడం జరిగిందని కానీ ప్రస్తుతం విద్యా శాఖలో వర్క్ అడ్జస్ట్మెంట్ ల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్ల ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందని, వెంటనే నిబంధనలకు విరుద్ధంగా పైరవీలతో కేటాయించిన డిప్యూటేషన్లు రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం 2023 జూలై నుంచి ప్రకటించాల్సిన పిఆర్ సి ని 40 శాతం పిట్మెంటుతో వెంటనే ప్రకటించి అమలు చేయాలని,ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 5 న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని ఈ ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగరాజు, మండల అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కనకయ్య సీనియర్ నాయకులు కరుణాకర్, మెట్టయ్య,వరప్రసాద్, యాదయ్య, నాగ స్వామి, అమరేందర్, మహిపాల్,ఉపాధ్యాయులు నర్సింగ రావు,సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



# వివాహానికి పుస్తె, మెట్టెలు బహుకరణ

**శివంపేట్ ఆగష్టు 2( సమయం న్యూస్):** శివంపేట్ మండల కేంద్రంలోని చండి గ్రామానికి చెందిన మియ్యాడి నర్సిములు కూతురు మానస వివాహానికి ప్రముఖ సంఘ సేవకులు తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్త సొంత నిధుల నుండి పుస్తె మట్టెలు ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్ ,చండి గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, రామస్వామి గౌడ్, సురేష్,శివంపేట వార్డ్ సభ్యులు కొవ్వూరి వెంకటేష్ ,వంజరి కొండల్, బసంపల్లి పోచ గౌడ్, పంబల సంతోష్, బిఆర్ఎస్ నాయకులు బసంపల్లి రామా గౌడ్, కమలయగారి మల్లేష్, ముయ్యడి అంజయ్య, ఉదండాపురం యాదయ్య గౌడ్ ,పంబాల భూమేష్, బసంపల్లి సుదర్శన్ గౌడ్ కొత్తపేట శ్రీనివాస్ గౌడ్, బొడ్డు సురేష్ పంబాల సతీష్ పైనం సందీప్ ,పెద్దగోని ధను గౌడ్ చిన్న గొట్టిముక్కల పాపయ్య, మరియు పబ్బ మహేష్ గుప్త యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# తల్లిపాల వారోత్సవాల ఉత్సవాలు



**పటాన్ చెరు(గుమ్మడిదల), ఆగస్టు 2 (సమయం):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వీరన్న గూడెం గ్రామాలలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఆగస్టు ఒకటి నుండి ఏడవ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహిస్తామని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మధులత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి బాలింతకు వివరించడానికి గ్రామాలలో గల అంగన్వాడీ కేంద్రాలలో సమావేశాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ పౌష్టికత కలుగుతుందని ఆమె తెలిపారు. పిల్లలకు రోగనిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏఎన్ఎం వసంత, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామీణ స్త్రీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# శివలింగ ఏర్పాటుకు భక్తుల బిక్షాటన



**పటాన్ చెరు(జిన్నారం), ఆగస్టు 2, సమయంన్యూస్ :** మండల కేంద్రమైన జిన్నారంలో తాబేలు గుట్టపై నిర్మిస్తున్న శివ ఆలయంలో శివలింగ స్థాపన గురించి గ్రామంలో శనివారం శివ భక్తులు భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్తులు మాట్లాడుతూ గ్రామంలో అన్ని హంగులతో తాబేలు గుట్టపై గణపతి, భ్రమరాంబికా సమేత శ్రీ జీవన జ్యోతిర్లింగ శివాలయం నిర్మాణం సుమారు కోటి రూపాయల వ్యయంతో జరుగుచున్నదని తెలిపారు. ఈ ఆలయంలో స్థాపించబడు విగ్రహమూర్తులు, శివలింగము గ్రామంలోని ప్రతి ఇంటి నుండి వచ్చిన సొమ్ముతోనే స్థాపితం చేయాలనే ముఖ్యఉద్దేశంతో, గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి భిక్షాటన కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్క మహిళ తమ ఇంటి ముందు కల్లాపు చల్లి ఇంటిని శుభ్రపరిచి మరి విరాళాలు ఇచ్చారని తెలిపారు. గ్రామంలో ఆలయం కోసం ఎంత మంచి స్పందన రావడం సంతోషకరమైన వారు తెలిపారు. సుమారు 60 మంది శివ భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ భక్తులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# గద్దరన్న వర్ధంతి జయప్రదం చేయండి



**రాయపోల్, ఆగస్టు2:** ప్రజా యుద్ధ నౌక గద్దరన్న రెండవ వర్ధంతి సభ అగస్టు 6 హైదరాబాదు రవింద్రభారతి లో నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ తెలిపారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దరన్న వర్ధంతి సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పిడిత ప్రజల విముక్తి కోసం గద్దరన్న జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. గద్దర్ పౌండెషన్ అధ్వర్యంలో గద్దరన్న రెండవ వర్ధంతి సభను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సభకు కళాకారులు, ప్రజసంఘాల నాయకులు ప్రజలు తరలిరవాలని కోరారు. రవింద్ర బారతిలో అగస్టు 6 న మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి వరకు కొనసాగుతదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు,రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు,జర్నలిస్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## అదుపుతప్పి ఆటో బోల్తా..

**వెల్దుర్తి ఆగస్టు 2 ( సమయం న్యూస్):** అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టిన ఘటన వెల్దుర్తి మండలం నెల్లూరు గంగమ్మ దేవాలయ సమీపంలో చోటు చేసుకుంది. తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు.. వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దుర్తిలో జరుగుతున్న అంగడికి వివిధ గ్రామాలవారు చేరుకొని వస్తువులను సేకరించి తిరిగి ప్రయాణమై వస్తుండగా వెల్దుర్తి నెల్లూరు మార్గమధ్యలో రోడ్డుపైన గుంతను గమనించక పోవడంతో అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న కొంతమంది ప్రయాణికులకు గాయాలు కాగా హుటా హుటిన క్షత గాత్రులను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఇందులో నాగమణి అనే మహిళ కాలుకు తీవ్ర గాయం కాగా దుర్గయ్య, మహేష్ తలకు గాయాలయ్యాయి, వీరిని హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించడం జరిగింది. ఇంకొక ఇద్దరికీ అతి స్వల్ప గాయాలు కాగా చికిత్స అందిస్తున్న తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి. వైద్యులు. వెల్దుర్తి పోలీసులు దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేసుకోవడం జరిగింది.

## నేడు నిజామాబాద్ జిల్లాలో సీతక్క పర్యటన

**బాన్సువాడ, ఆగస్టు 2 ( సమయం న్యూస్):** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజక వర్గంలోని చందూర్, మోస్రా మండలాల్లో ఆదివారం నిజామాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ ( సీతక్క ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

## మహేష్ గౌడ్ కలిసిన నాయకులు



**శివంపేట్ ఆగస్టు 2 (సమయం న్యూస్):** అందోల్ నియోజకవర్గం జనహిత పాదయాత్రలో భాగంగా టిపిసిసి తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్ మెదక్ జిల్లా ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, శివంపేట్ మండల పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కొడకంచి సత్య గౌడ్ జ్ఞాపకార్థం మహా అన్నదాన కార్యక్రమం!




**శివంపేట్ ఆగష్టు 2( పబ్లిక్ న్యూస్):** శివంపేట మండల కేంద్రంలోని సహకార ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శ్రావణమాసం పురస్కరించుకొని శివంపేట గ్రామానికి చెందిన కీర్తిశేషులు కొడకంచి సత్య గౌడ్ కుమారులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, రవీందర్ గౌడ్ నరసింహులు గౌడ్ ఐదు సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా శ్రావణమాసంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు చేయాలని ఆలోచన చాలా తక్కువ మందికి ఉంటుంది. కొడకంచి శ్రీనివాస్ గౌడ్ సోదరులు కలసి అన్నదానం చేయడం చాలా సంతోషించదగిన విషయం. వీరిని ఆంజనేయస్వామి భక్తులు అభినందిస్తూ వీరికి ఎల్లప్పుడూ సహకార ఆంజనేయస్వామి ఆశీర్వాదం ఉంటుందని ఆలయ ఫౌండర్ ఛైర్మన్ ఆంజనేయులు శర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి దత్తు శర్మ, శివ ప్రసాద్ గౌడ్, సాయి మణికంఠ గౌడ్, ప్రదీప్ గౌడ్, బుర్ర సాయి కిరణ్ గౌడ్ , కొడకంచి అశోక్ గౌడ్ , కొంతన్ పల్లి అరుణ్ గౌడ్ , మరియు సహకార ఆంజనేయ స్వామి భక్తులు తదితరులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు

**మెదక్, ఆగస్టు 2 (సమయం):** 2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ఎస్సీ విధ్యార్థులు ఫ్రెష్, రెన్యూవల్ స్కాలర్‌షిప్‌కోసం దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని జి. విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్30 వరకు అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన విధ్యార్థులు వెబ్సైట్ http://telanganaepass.cgg.gov.inలో దరఖాస్తూ చేసుకోవాలన్నారు. అలాగే సంబందిత ప్రభుత్వ / ప్రైవేట్ కళాశాలల యజమాన్యం, ప్రిన్సిపాళ్లు తమ కళాశాలలో అర్హత గల విద్యార్థులను పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌కోసం దరఖాస్తు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**వెల్దుర్తి ఆగస్టు 02,(సమయం న్యూస్):** వెల్దుర్తి మండలం ఎద్దులపల్లి గ్రామంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్, కందడి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో 150 మంది యువకులు బిజెపిలో చేరిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెదక్ ఎంపీ రఘు నందన్ రావు. శనివారం వెల్దుర్తి మండలం ఎద్దులపల్లి గ్రామంలో బిజెపి పార్టీలో చేరికల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రఘునందన్ రావు మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పరిపాలన చేసిన వెల్దుర్తి మండలంలోని ఎద్దులపల్లి గ్రామానికి ఏ దిక్కు చూసినా రోడ్డు లేకపోవడం సిగ్గుచేటని మెదక్ ఎంపీ రఘు నందన్ రావు,గత బి ఆర్ ఎస్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పై మండిపడ్డారు. గతంలో సర్పంచులు వాళ్లే ఎంపీటీసీలు ఎమ్మెల్యేలు మంత్రులు కూడా వాళ్ళె ఉండి కనీసం మెదక్ జిల్లా కేంద్రానికి వెల్దుర్తి మండలం నుంచి డబల్ రోడ్డును వేయకపోవడం ఎంత సిగ్గుచేటని రఘునందన్ రావు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆరు గ్యారంటీలతో, 420 హామీలతో ప్రజలను ఆదుకుంటామని కాంగ్రెస్ మాయమాటలు, అబద్ధాలు చెప్పి ప్రజానీకాన్ని మోసం చేసి 18 నెలలు గడుస్తున్న కాలక్షేపం తప్ప ప్రజలకు చేసింది ఏం లేదని ఎద్దేవా చేశారు. మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్నిసార్లు మెదక్ వచ్చిన, వెల్దుర్తి మెదక్ రోడ్డును మంజూరు చేయకపోవడంపై ఇదేనా మీ ప్రజా పాలన అంటూ మండిపడ్డారు. వెల్దుర్తి మండల వాళ్ళు ఎక్కడ కలిసినా మాకు రెండు బస్సులు వెల్దుర్తి,మెదక్ రోడ్డు మంజూరు చేయించాలని పదేపదే అడగడంతో ఈరోజు మారుమూలన ఈ గ్రామానికి విచ్చేసి గ్రామస్తులు ముందర చెప్తున్నాను ఆరు నూరైనా ఈ గ్రామానికి రోడ్డు మంజూరు చేయించి త్వరలోనే మళ్లీ వస్తానని అన్నారు. ప్రస్తుతం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం మళ్లీ కాంగ్రెస్ సర్కార్ లబ్ధి పొందడానికి కుటిలప్రయత్నాలు, రాజకీయాలు మొదలుపెట్టిందన్నారు. మీరు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా గ్రామాల్లో ప్రజలు మిమ్మల్ని నమ్మేటట్లు లేరని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, జిల్లా నాయకుడు మురళి యాదవ్ , పాప గారి రమేష్ గౌడ్, వెల్దుర్తి మండల బిజెపి అధ్యక్షుడు దాసు, మండల ఉపాధ్యక్షుడు బాలకిషన్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు చెంది నర్సింలు కర్ర వెంకటేశం, నాయకులు శివ, హనుమాద్రి శ్రీధర్ గౌడ్, శేఖర్ గౌడ్, నవీన్ పటేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్జీపీఏటీల సమస్యల పరిష్కారానికి ఛలో హైదరాబాద్



**వరంగల్, వరంగల్(సమయం):** స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ(ఎస్జీపీఏటీ) వరంగల్ జిల్లాశాఖ జనరల్ కౌన్సిలింగ్ సమావేశం కర్రు సుధీర్ బాబు అధ్యక్షతన ఇన్నర్ వీల్ ఫంక్షన్ హాలు కొత్తవాడ వరంగల్ లో శనివారం నిర్వహించారు. పెన్షనర్ల సమస్యలు, ఈహెచ్ఎస్, డీఆర్, సీపీఆర్సీ వెంటనే 10 ఆగస్టు వరకు పరిష్కరించాల్సినదిగా రాష్ర ప్రభుత్వన్ని కోరారు. లేనియెడల మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టాల్సిందిగా కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో ఎస్జీపీఏటీ నూతన కార్యవర్గం ఎన్నికల అధికారులుగా విచ్చేసిన డాక్టర్‌వెంగళరెడ్డి, డాక్టర్‌మార్క శంకరనారాయణ, పరిశీలకులుగా పరుశ పుల్లయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వీరస్వామి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తుమ్మ వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా జి సాంభయ్య, కోశాధి కారిగా నిమ్మకాయల సదానందం, అసోసియేట్ అధ్యక్షులుగా పి. పరమేశ్వర్, ఉపాధ్యక్షులుగా కె.వీరస్వామి, ఎ. వనజ, యం.డి. మహినోద్దీన్, డాక్టర్ వెంకటనారాయణ, పి.పెద్దన్న, జి. నర్సింహారాములు, యం.డి. మహబూబ్‌అలీ, కార్యదర్శులుగా యస్.రాజయ్య, సారంగపాణి, బిక్షపతి, సరస్వతీ, విజయకుమార్, కుసుమ మధుసూధన్ రావు, జి.కామేశ్వర్. ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జి హరిప్రసాద్, కె. కుమారస్వామి, రమేష్, వీరస్వామి, సత్యనారాయణ, సారంగపాణి, షర్ఫుద్దీన్, అడ్వైజర్స్ గా జి.ప్రతాప రెడ్డి, యుగేందర్, రాంచందర్. ఈసీ మెంబర్స్ గా వి.రవీందర్, వీరభద్రం, కె.వేణుగోపాల్, కె. డానియల్, జి. కాంతయ్య, బొమ్మ రఘుపతి ఎన్నికయ్యారు. వందన సమర్పణతో కార్యక్రమం ముగిసినది.

# ఆదివాసీల చరిత్రపై ఇలవేల్పుల గ్రంథం రూపకల్పన

## ఐటీడీఏ పీవో రాహుల్



**ఆగస్టు 2 , భద్రాద్రి కొత్తగూడెం ( సమయం న్యూస్):** ఆదివాసి గిరిజన తెగలకు సంబంధించిన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, అంతరించిపోకుండా నేటి తరానికి మరియు ముందు తరాల యువతీ యువకులు తెలుసుకునే విధంగా ఇలవేల్పుల గ్రంధాన్ని రూపొందిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శనివారం నాడు ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సి భవనంలోని సమావేశ మందిరంలో ఆదివాసి కోయ ఇలవేల్పుల చరిత్ర, సాంస్కృతి సాంప్రదాయాల గ్రంథస్థం కొరకు తలపతులు మరియు ఆర్తి బిడ్డలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆర్తి బిడ్డలు, తలపతులు వారి సాంప్రదాయం మరియు ఇలవేల్పుల కట్టుబాట్లు, ఆచార వ్యవహారాల గురించి వివరించిన అంశాలను ఆయన పూర్తిగా అవగాహన చేసుకున్న అనంతరం మాట్లాడుతూ వర్తమాన కాలాన్ని దృష్టిలో పెట్టుకొని రాబోయే తరానికి ఆదివాసుల చరిత్ర పూర్తిస్థాయిలో తెలుసుకోవడానికి అలాగే మన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, పూజా విధానం అంతరించిపోకుండా నేటి తరానికి ముందు తరాలకు మరియు ఖండాంతరాలకు తెలిసే విధంగా 5 గోత్రాలు మరియు ఇలవేల్పులకు సంబంధించిన తలపతులను, ఆర్తి బిడ్డలను బృందాలుగా ఏర్పాటు చేసి మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో ఇలవేల్పులకు సంబంధించిన పూర్తి చరిత్రను సేకరించడం జరిగిందని, ఒక్కొక్క ఆదివాసి తెగలకు సంబంధించిన గిరిజనుల ఆచార వ్యవహారాలు, పండుగలు మరియు పూజా విధానము, ఆహార నియమాలు అన్ని క్రోడీకరించి గిరిజన తెగల పాతతరం పెద్దమనుషులను సంప్రదించి సేకరించడం జరిగిందని అన్నారు. ఈ ఐదు బృందాలు సేకరించిన ఇలవేల్పుల చరిత్రను వివిధ తెగల తలపతులకు, ఆర్తి బిడ్డలకు విపులంగా వివరిస్తారని, వారి ఇలవేల్పులకు సంబంధించిన చరిత్ర కచ్చితంగా ఉన్నది లేనిది తెలియజేయాలని, తలపతులు సూచించిన విధంగానే ఈ యొక్క గ్రంధాన్ని రూపొందిస్తామని ఏమైనా తప్పులుంటే సరిదిద్దుతామని అన్నారు. ఈ ఇలవేల్పుల చరిత్రను వెయ్యి సంవత్సరాల వరకు అయినా చెక్కుచెదరకుండా జాగ్రత్త పరచడానికి ప్రయత్నిస్తున్నామని, ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ రమేష్, రిటైర్డ్ ఏసిఎంఓ రమణయ్య, మ్యూజియం ఇంచార్జ్ వీరాస్వామి, తలపతులు మరియు ఆర్తి బిడ్డల సంఘ నాయకులు జగపతిరావు, కోటేశ్వరరావు, చలపతిరావు, పోషాలు, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, కొత్తగూడెం జిల్లాల తలపతులు, ఆర్తి బిడ్డలు తదితరులు పాల్గొన్నారు.

# 5 నుంచి 8 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపు



**పెద్దపల్లి, ఆగస్టు 2 (సమయం న్యూస్):** ఆగస్టు 5 నుంచి 8 వరకు కలెక్టరేట్ ఆవరణ లో ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డు కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక క్యాంపులో నూతన ఆధార్ కార్డు ఎన్ రోల్ మెంట్ ఉచితంగా జరుగుతుందని అన్నారు. బయోమెట్రిక్ అప్ డేషన్ (ఫింగర్ ప్రింట్,ఐరిస్, ఫోటో) చేయడానికి 100 రూపాయల రుసుం మరియు డేమోగ్రాఫిక్ అప్ డేషన్ బయోమెట్రిక్ అప్ డేట్ తో కలిసి చేస్తే ఉచితంగా ఉంటుందని, ప్రత్యేకంగా డేమోగ్రాఫిక్ అప్ డేషన్(అడ్రస్,మొబైల్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, పేరు...) 50 రూపాయల రుసుము చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా ఆధార్ కార్డు పొందేందుకు కావాల్సిన ధృవ పత్రములు మీసేవ ద్వారా అడ్రస్ తో జారీ చేయబడిన బర్త్ సర్టిఫికెట్ , తల్లి లేదా తండ్రి అప్ డేట్ చేసిన ఆధార్ కార్డు మరియు ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా నివాస సర్టిఫికెట్, బ్యాంకు పుస్తకం/ పోస్టల్ బుక్ తో సహా అటెస్టడ్ దరఖాస్తు ఫారం ఉండాలని, ఆధార్ కార్డు లో పేరు అక్షరాల సవరణ,పొరపాట్ల సవరణకు ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా పాన్ కార్డు లేదా ఎస్.ఎస్.సి మార్కుల మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేదా మైనర్ ఐతే బర్త్ సర్టిఫికెట్ ఉండాలని, పెళ్లి తర్వాత పేరు మార్పు కోసం సబ్ రిజిస్టర్ జారీ చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్ , పెళ్లి ఫోటో, ఇతర గుర్తింపు కార్డులు ఉండాలని, పూర్తిగా పేరు మార్పు కోసం గెజిట్ (%+ఘఓవ్వ%) చేసి ఉండాలని,ఆధార్ కార్డు లో డేట్ అఫ్ బర్త్ కరెక్షన్ కోసం బర్త్ సర్టిఫికెట్ , 21 సంవత్సరాల పైబడిన వారికి ఫోటో తో కూడిన మార్కుల మెమో లేదా ఇండియన్ పాస్ పోర్ట్ ఉండాలని అన్నారు. ఆధార్ కార్డు లో సవరణలు లేదా కొత్త ఆధార్ కార్డు దరఖాస్తు కొరకు తమ ఒరిజినల్ ధృవ పత్రములు తప్పనిసరిగా తీసుకొని రావాలని, కలెక్టరేట్ లో ఏర్పాటు చేసే ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డు ను ప్రజలు, ఉద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీ






**క్రీడల్లో తెలంగాణ యువత రాణించాలి**

**చదువుతో పాటు ఆటల్లోనూ మేటి కావాలి**

**యువత పెడదోవ పట్టకుండా క్రీడల్లో ప్రోత్సాహం**

**తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్ :** ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా విధానం లేకపోవడం వల్ల పట్టణ ప్రాంతాల్లోని యువత పెడదోవ పడుతు న్నారని, క్రీడలను ప్రోత్సహించక పోవడం వల్లే యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. శనివారం హెచ్ఐసీసీలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంతో పోటీపడే మనం.. క్రీడల్లో వెనకబడి ఉండడం బాగాలేదన్నారు. భారత్‌కు బలమైన క్రీడా వేదిక కావాలని.. అందులో తెలంగాణ ప్రధానంగా ఉండాలని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నామని.. యువతకు దశ దిశా లేకపోవడం బాధాకరమని అన్నారు. వ్యసనాల రూపంలో మనవైపు వేగంగా ప్రమాదం దూసుకొస్తుందని అన్నారు. ఓ విధానం లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని.. అందుకే నూతన క్రీడావిధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు. క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని భావిస్తున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పై స్పోర్ట్స్ చాప్టర్ పెడతామని అన్నారు. 1956లో ఫుట్ బాల్ టీంలో మనవాళ్ళు 9 మంది ఉండేవారని.. క్రీడల్లో హైదరాబాద్‌కు మంచి పేరు ఉండేదని అన్నారు. జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో రాణించినవారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. చదువుల్లోనే కాదు, క్రీడల్లోనూ రాణిస్తే ఉద్యోగం ఇస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడా నైపుణ్యానికి కొదవ లేదని అన్నారు. ఇప్పుడు స్టేడియంలు ఫంక్షన్ హాల్స్ గా మారాయని అన్నారు. ఒలంపిక్స్ లో ఒక్క గోల్డ్ మెడల్ కూడా రాకపోవడం సిగ్గు అనిపిస్తోందని అన్నారు. మనకంటే చాలా చిన్న దేశాలు క్రీడల్లో రాణిస్తున్నాయని అన్నారు. ఇటీ-వల సౌత్ కొరియాను సందర్శించామని.. అక్కడ స్పోర్ట్స్ వర్సిటీలో చదివినోళ్లే గోల్డ్ మెడల్స్ కొట్టారని అన్నారు. చైతన్యానికి పోరాటానికి మారుపేరైన తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో నిలబడి పోరాటం చేసిన యువత నేడు దశ దిశా లేకుండా.. ప్రభుత్వాలకు సరైన విధానాలు లేకపోవడం వల్ల వ్యసనాల వైపు వేగంగా ప్రయాణిస్తున్నారని అన్నారు. పోరాట స్ఫూర్తి, చైతన్యం ఉన్న ఈ ప్రాంతం క్రీడల్లో రాణించాలని, దేశానికి గొప్ప పేరు తేవాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రానికి క్రీడావిధానం ఉండాలని, క్రీడా విధానంలో రాజకీయ జోక్యం తగ్గించాలని, క్రీడాకారుల స్ఫూర్తిని పెంచాలని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ తో నూతన క్రీడా విధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు.

# ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక సార్లు 4 వికెట్ల ఘనత

## చరిత్ర సృష్టించిన మహమ్మద్ సిరాజ్



టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్ చరిత్ర సృష్టించాడు. ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక సార్లు 4 వికెట్ల ఘనతను అందుకున్న భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను జస్ప్రీత్ బుమ్రా రికార్డ్‌ను అధిగమించాడు. ఇంగ్లండ్‌తో ఓవల్ వేదికగా జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లో నాలుగు వికెట్లు తీయడం ద్వారా సిరాజ్(4/86) ఈ ఫీట్ సాధించాడు. అంతేకాకుండా వకార్ యూనిస్ తర్వాత ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక నాలుగు వికెట్ల ఘనతను అందుకున్న ఆసియా బౌలర్‌గా కూడా నిలిచాడు. వకార్ యూనిస్ ఇంగ్లండ్ గడ్డపై 6 సార్లు నాలుగు వికెట్ల ఘనతను అందుకున్నాడు. సిరాజ్ ఐదు సార్లు నాలుగు వికెట్లు పడగొట్టగా.. బుమ్రా నాలుగు సార్లు నాలుగు వికెట్ల ఘనతను సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 200 వికెట్ల మైలురాయి అందుకున్న సిరాజ్.. ఈ క్రమంలో సచిన్ టెండూల్కర్‌ను అధిగమించాడు. టెస్ట్‌ల్లో 118 వికెట్లు తీసిన సిరాజ్.. వన్డేల్లో 71, టీ20ల్లో 14 వికెట్లు పడగొట్టాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 203 వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో సచిన్ టెండూల్కర్ 201 వికెట్ల రికార్డ్‌ను అధిగమించాడు. టెస్ట్‌ల్లో 46 వికెట్లు తీసిన సచిన్.. వన్డేల్లో 154, టీ20ల్లో ఓ వికెట్ పడగొట్టాడు. ఆఖరి టెస్ట్‌లో సిరాజ్ కీలక వికెట్లు పడగొట్టాడు. ఓలీ పోప్, జోరూట్, హ్యారీ బ్రూక్, జెమీ స్మిత్‌లను పెవిలియన్ చేర్చి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు సిరాజ్ 9 ఇన్నింగ్స్‌ల్లో 17 వికెట్లు పడగొట్టాడు. అంతేకాకుండా ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడిన ఏకైక పేస్ బౌలర్ కూడా సిరాజే. ఇంగ్లండ్ తరపున క్రిస్ వోక్స్ ఐదు టెస్ట్‌లు ఆడగా.. చివరి మ్యాచ్ మధ్యలోనే గాయంతో దూరమయ్యాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకు ఆలౌటవ్వగా.. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేసింది. 27 పరుగుల లోటు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 75/2తో నిలిచింది. క్రీజులో యశస్వి జైస్వాల్(51 బ్యాటింగ్)తో పాటు ఆకాష్ దీప్(4) ఉన్నాడు.

## సచిన్ రికార్డును బద్ధలు కొట్టిన జో రూట్

ఇంగ్లండ్ దిగ్గజ బ్యాట్స్‌మెన్ జో రూట్ భారత్‌తో జరుగుతున్న ఓవల్ టెస్ట్‌లో ఒక గొప్ప రికార్డును సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతను కేవలం 29 పరుగులు మాత్రమే చేసినప్పటికీ, టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నాడు. స్వదేశంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌ల జాబితాలో దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును రూట్ బద్దలు కొట్టాడు. ఓవల్ టెస్ట్‌లో రూట్ తన కెరీర్‌లో 84వ హోమ్ టెస్ట్ ఆడుతున్నాడు. ఈ మ్యాచ్‌లో 29 పరుగులు చేయడం ద్వారా అతను స్వదేశంలో మొత్తం 7224 పరుగులు పూర్తి చేశాడు. సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో ఆడిన 94 హోమ్ టెస్ట్‌లలో 7216 పరుగులు చేశారు. ఈ గణాంకాలతో రూట్ ఇప్పుడు హోమ్ టెస్ట్‌లలో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌ల జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ జాబితాలో రూట్ కంటే ముందు ఉన్నది కేవలం ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ మాత్రమే. పాంటింగ్ 92 హోమ్ టెస్ట్‌లలో 7258 పరుగులు సాధించాడు. ఓవల్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో రూట్ గనుక మరో 35 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేస్తే, అతను పాంటింగ్‌ను కూడా అధిగమించి, కొత్త ప్రపంచ రికార్డును సృష్టిస్తాడు. ఓవల్ టెస్ట్ మ్యాచ్ విషయానికి వస్తే, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చింది. ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసి, ఇంగ్లండ్‌పై 52 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 51 పరుగులు చేసి క్రీజులో ఉన్నాడు, అతనికి నైట్‌వాచ్‌మ్యాన్ ఆకాశ్‌దీప్ సింగ్ తోడుగా ఉన్నాడు. అంతకుముందు, ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌట్ కాగా, భారత్ తొలి ఇన్నింగ్స్ 224 పరుగుల వద్ద ముగిసింది. ఓవల్ పిచ్ బ్యాట్స్‌మెన్‌లకు అనుకూలంగా ఉందని భావిస్తున్నారు, కాబట్టి జో రూట్‌కు రికీ పాంటింగ్ రికార్డును బద్దలు కొట్టడానికి ఇది ఒక మంచి అవకాశం. అతను గనుక రెండో ఇన్నింగ్స్‌లో కూడా రాణిస్తే, టెస్ట్ చరిత్రలో ఒక అరుదైన రికార్డు అతని పేరు మీద నమోదు అవుతుంది.

# 2025 ఆసియా కప్‌లో బుమ్రా ఆడటం కష్టమే




భారత క్రికెట్ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లండ్‌తో జరుగుతున్న 5వ టెస్ట్ మ్యాచ్ ఆడటం లేదు. కెన్నింగ్టన్ ఓవల్‌లో జరుగుతున్న సిరీస్‌లోని కీలకమైన చివరి టెస్టులో బుమ్రా లేదు. వాస్తవానికి చివరి టెస్ట్ నుంచి అతడికి బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. బుమ్రా త్వరలో జరగనున్న ఆసియా కప్‌లో ఆడటం కష్టమేనని వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో నిర్వహిస్తున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో కేవలం 3 టెస్టులు మాత్రమే బుమ్రా అందుబాటులో ఉంటాడని సిరీస్‌కు ముందే బీసీసీఐ స్పష్టం చేసింది. అందుకు తగ్గట్లుగానే స్టార్ పేసర్ మూడు టెస్టులు మాత్రమే ఆడాడు, రెండు టెస్టులకు అందుబాటులో లేడు. శుక్రవారం ప్రారంభమైన చివరి టెస్టు జట్టు నుంచి బుమ్రాను రిలీజ్ చేశారు. ముఖ్యమైన విషయం ఏంటంటే, కెన్నింగ్టన్ ఓవల్‌లో ప్రాక్టీస్ సెషన్‌కు కూడా బుమ్రా రాలేదు. ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సైతం ఈ టెస్టు ఆడటం లేదు. కానీ బుమ్రాలా కాకుండా స్టోక్స్ తన జట్టుతోనే ఉన్నాడు. ఆల్ రౌండర్ ప్రాక్టీస్ సెషన్‌లకు హాజరయ్యాడు. కానీ జస్ప్రీత్ బుమ్రా ఆ పని చేయలేదు. వర్క్‌లోడ్ కింద జస్ప్రీత్ బుమ్రా ఆసియా కప్ నుంచి సైతం దూరంగా ఉండే అవకాశం ఉంది. 2025 ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరుగుతుంది. ఆసియా కప్ ఫైనల్ సెప్టెంబర్ 29న జరుగుతుంది. ఆ వెంటనే అక్టోబర్ 2 నుండి వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. దాంతో బుమ్రాపై ఓవర్ లోడ్ ఉండకూడదని, టెస్ట్ సిరీస్ కోసం పేసర్ కావాలనుకుంటే ఆసియా కప్ నుంచి తనకు విశ్రాంతి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. "ఇది కష్టమైన నిర్ణయం అని చెప్పవచ్చు. బుమ్రాకు టెస్ట్ క్రికెట్ అంటే ఇష్టం. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్లు కూడా మనకు చాలా ముఖ్యం. టీ20 విషయానికొస్తే జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌కు అందుబాటులో ఉంటాడు. ఇది టీ20 ప్రపంచ కప్ కోసం భారత్‌కు కీలకమైన సిరీస్ కానున్నాయి" అని న్యూస్ ఏజెన్సీ పీటీఐ వర్గాల సమాచారం అని రాసుకొచ్చింది. గత టీ20 వరల్డ్ కప్ నెగ్గిన తరువాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతో పాటు ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా సైతం పొట్టి ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నివేదికలో ఉటంకిస్తూ, "ఒకవేళ జస్ప్రీత్ బుమ్రా 2025 ఆసియా కప్ ఆడితే కనుక అహ్మదాబాద్‌లో జరిగే వెస్టిండీస్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌కు బుమ్రా అందుబాటులో ఉండడు. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ కోసం జట్టులో బుమ్రా అవసరం ఉంటుందని అందరికీ తెలుసు. అతను ఆసియా కప్ ఆడితే వెస్టిండీస్‌తో జరిగే టెస్ట్ సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకుంటాడు. విండీస్ సిరీస్ వదులుకోవాలంటే ఆసియా కప్ లో బుమ్రాను చూడవచ్చు" అని పీటీఐ పేర్కొంది.



# మా మధ్య ఎమోషన్స్ తెగిపోయాయి

**రిలేషన్‌షిప్‌లో కాంప్రమైస్ అవ్వడం చాలా ముఖ్యం**

**విడాలకుపై తొలిసారి స్పందించిన చాహల్**

టీమ్ఇండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ ఎట్టకేలకు ధన శ్రీ వర్మతో విడాకుల విషయంపై మాట్లాడాడు. రీసెంట్‌గా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న చాహల్ తన విడాకులకు గల కారణాలు వెల్లడించాడు. ఈ నిర్ణయం ఒక్కరోజులో తీసుకుంది కాదని, చాలా ఆలోచించిన తర్వాతే తాను ధన శ్రీతో విడిపోయినట్లు చెప్పుకొచ్చాడు. "వివాహ బంధానికి స్వస్తి చెప్పి, విడాకులు తీసుకోవాలన్న ఆలోచన మా ఇద్దరికీ ఉండేది. అయితే ఈ విషయం ఆఖరి వరకూ గోప్యంగానే ఉంచాలని నిర్ణయించుకున్నాం. మా పర్సనల్ లైఫ్ గురించి బయట పెట్టకూడదనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం. అంతేకాదు మా ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నప్పటికీ చాలాకాలం బయటి ప్రపంచానికి భార్యాభర్తలుగానే కనిపించాం""మేమిద్దరం మా పర్సనల్ కెరీర్‌లో సక్సెస్ కావాలని అనుకున్నాం. అందుకే రిలేషన్‌షిప్‌కు ప్రాధాన్యం ఇవ్వలేకపోయాం. మా మధ్య ఎమోషన్స్ తెగిపోయాయి. ఇద్దరి ఆశయాలు, ఆలోచనలు, వ్యక్తిత్వాలు ఒకే మార్గంలో లేనప్పుడు రిలేషన్‌షిప్‌పై ఎఫెక్ట్ పడుతుంది. రిలేషన్‌షిప్‌లో కాంప్రమైస్ అవ్వడం చాలా ముఖ్యం. ఒకరు కొపంగా ఉన్నప్పుడు, ఇంకొకరు సైలెంట్‌గా వాళ్లు చెప్పింది వినాలి. ఒక్కోసారి ఇద్దరి వ్యక్తుల వ్యక్తిత్వాలు మ్యాచ్ అవ్వవు" 'కెరీర్‌లోపై సీరియస్‌గా ఉన్నప్పుడు భాగస్వామికి సమయం ఇవ్వడం కష్టం అవుతుంది. ఆ పరిస్థితులను మరొకరు అర్థం చేసుకోవాలి. నేను టీమ్ఇండియాకు ఆడుతున్నా, ఆమె తన ప్రొఫెషన్‌లో ఉంది. ఇలా 1-2 సంవత్సరాలు కొనసాగింది. ప్రతీ ఒక్కరికీ తమ కెరీర్‌లో పర్సనల్ గోల్స్ ఉంటాయి. ఓ భాగస్వామిగా ఇద్దరూ పరస్పరం మద్దతు ఇచ్చుకోవాలి. నువ్వు ఏదో సాధించాలని 18-20 ఏళ్లుగా కష్టపడుతుంటే, ఆ కలను రిలేషన్‌షిప్ కోసం వదులుకోకూడదు" అని చాహల్ పేర్కొన్నాడు. అలాగే ధన శ్రీతో విడిపోయిన తర్వాత తనను మోసగాడు అంటూ సోషల్ మీడియాలో ట్రోల్ చేశారని చాహల్ గుర్తుచేసుకున్నాడు. ఆ సయమంలో కొన్నిసార్లు తనకు సూసైడ్ ఆలోచనలు కూడా వచ్చాయని తెలిపాడు. "డివోర్స్ తర్వాత చాలామంది నన్ను మోసగాడిగా అభివర్ణించారు. కానీ నేనెప్పుడూ ఎవరిని కూడా మోసం చేయలేదు. చాలా నమ్మకమైన వ్యక్తిని నేను. నాలాంటి వ్యక్తిని మీరు చూడరు. నా విషయంలో కొంతమందికి ఏం జరిగిందో మాత్రం నాకు తెలియదు. కానీ నన్ను తప్పుబట్టారు""చాలామంది విమర్శించారు కూడా. మోసగాడు అంటూ కామెంట్లు కూడా చేశారు. నాకు ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. వారితోనే కలిసి పెరిగాను. మహిళలను ఎలా గౌరవించాలనేది, నా తల్లిదండ్రులు నేర్పారు. నాకు సంస్కారం ఉంది. కానీ, నా పేరును ఇతరులతో లింక్ చేసి, వాళ్ల వ్యూస్ కోసం చాలా కథనాలు రాశారు. అలాంటి సమయంలో తీవ్ర ఒత్తిడికి గురయ్యా. రోజులో 2 గంటలే నిద్ర పోయిన సందర్భాలూ ఉన్నాయి. 45 రోజులపాటు కంటిమీద కునుకు లేదు. క్రికెట్ నుంచి విరామం తీసుకున్నా. దేనిపైనా ఏకాగ్రత పెట్టలేకపోయాను. దీంతో నా ఫ్రెండ్స్?తో కొన్నిసార్లు సూసైడ్ ఆలోచనలు కూడా షేర్ చేసుకున్నా" అని చాహల్ చెప్పుకొచ్చాడు.



# అవార్డు గ్రహీతలకు చిరంజవి శుభాకాంక్షలు



71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఏడు కేటగిరీల్లో తెలుగు సినిమాకు అవార్డులు వరించాయి. బాలకృష్ణ కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'భగవంత్ కేసరి' చిత్రం 'ఉత్తమ ప్రాంతీయ తెలుగు చలనచిత్రం' అవార్డును గెలుచుకుంది. అలాగే ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సోషియో ఫాంటసీ 'హను-మాన్'.. ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగం లో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. 'బేబీ'కి బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ సింగింగ్ అవార్డులు దక్కాయి. ఉత్తమ బాలనటి కేటగిరిలో 'గాంధీతాత చెట్టు-' సినిమా నుంచి సుకృతివేణి అవార్డుకు ఎంపికైంది. తెలుగు చిత్రాలు సత్తా చాటిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి తన సోషల్ మీడియాలో జాతీయ అవార్డ్ గ్రహీతలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్ చేశారు. 'తెలుగు టాలెంట్, తెలుగు సినిమాలు ఈసారి పదికి పైగా విభాగాల్లో అవార్డులు గెలుచుకోవడం చూసి ఎంతో గర్వంగా ఉంది.. ' అంటూ పోస్ట్ లో పేర్కొన్నారు. అలానే బాలయ్య నటించిన భగవంత్ కేసరి చిత్ర బృందానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే తన పోస్ట్‌లో అవార్డులు గెలుచుకున్న వారికి సంబంధించిన లిస్ట్ కూడా పెట్టారు. తెలుగు సినిమా విజేతలకు ప్రత్యేక అభినందనలు. భారతీయ సినిమాకి ఈ అవార్డులు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని చిరు అన్నారు.



# చెప్పు తెగుద్ది..

## అనసూయ స్ట్రాంగ్ వార్నింగ్

టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ కొందరు యువకులకు అసభ్య కామెంట్లు చేస్తే చెప్పు తెగుద్ది అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కపూరంలోని ఓ షాపింగ్‌మాల్ ఓపెనింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన అనసూయని కొందరు ఆకతాయిలు కామెంట్లు- చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబసభ్యులను ఇలాగే కామెంట్లు- చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# ఓజీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ విడుదల

టాలీవుడ్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ'. 'సాహో' ఫేం సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ అభిమానులను అలరించాయి ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ ఓజీ ఫైర్ స్ట్రోమ్ ని విడుదల చేశారు మేకర్స్. థమన్ సంగీతం అందించిన ఈ పాటకు థమన్ ఎస్ , నజీరుద్దీన్ భరతరాజ్ , సిలంబరసన్ టిఆర్ (శింబు) , దీపక్ బ్లూ, రాజా కుమారి కలిసి పాడారు.

# రెండోభాగం మరింత ఆసక్తిగా ఉంటుంది

## కింగ్డమ్ సీరియల్‌పై విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ భారీ వసూళ్లను రాబడుతోంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రం.. విమర్శకుల ప్రశంసలతో పాటు-, ప్రేక్షకులను మెప్పు పొందుతోంది. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా.. వెండితెరపై ఓ కొత్త అనుభూతిని కలిగిస్తోందని, విజువల్ గా అద్భుతంగా ఉందని చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. 'కింగ్‌డమ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో.. తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన విజయ్ దేవరకొండ, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కేవలం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాల్లో, ఓవర్సీస్ లో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మలయాళంలో ఈ స్థాయి స్పందన ఊహించలేదు. మలయాళ వెర్షన్ విడుదల చేయకపోయినా.. అక్కడి ప్రేక్షకులు ఇంతటి ప్రేమ చూపించడం చాలా ఆనందంగా ఉందని విజయ్ అన్నారు. కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలెబ్రేట్ చేసుకోవాలనే ఆలోచన ఉండదు. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. పెళ్లి చూపులు హిట్ అయినప్పుడు.. ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ సినిమా విడుదలకు ముందు ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. కింగ్‌డమ్ విడుదలకు ముందు మాక్కూడా ఆలాంటి ఒత్తిడి ఉంది. ఎప్పుడైతే మొదటి షో పూర్తయ్యి, పాజిటివ్ వచ్చిందో.. అప్పుడు చాలా సంతోషం కలిగిందన్నారు. గౌతమ్ కుటుంబ బంధాలను, ఎమోషన్స్ ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామా అనే ఐడియా గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. జెర్సీ లాంటి ఎమోషనల్ జర్నీలో కూడా మనకు హై ఇచ్చే మూమెంట్స్ ఉంటాయి. గౌతమ్ కి ప్రతి విషయం మీద పట్టు- ఉంటుంది. హీరో పాత్ర, షాట్ కంపోజిషన్, మ్యూజిక్ ఇలా ప్రతిదాని మీద ఎంతో శ్రద్ధ తీసుకుంటాడు. కింగ్‌డమ్ కోసం ఆసక్తికర కథనం రాశాడు. ఇందులో ఏదో యాక్షన్ సన్నివేశం పెట్టాలి కదా అన్నట్టుగా ఎక్కడా పెట్టలేదు. దాని చుట్టూ బలమైన ఎమోషన్ ఉండేలా చూసుకున్నాడు. ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. కానీ, ఇందులో దేశభక్తికి సంబంధించిన అంశముంది. అలాగే, ఒక తెగకు చెందిన నాయకుడి గురించి ఉంటుంది. ఇలా ఇన్ని అంశాలను ఒకే భాగంలో చెప్పడం సాధ్యంకాదు. అందుకే రెండు భాగాలుగా చెప్పాలని నిర్ణయించు కున్నాము. తన అన్నయ్య శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని మొదటి భాగంలో చూశాం. రెండవ భాగానికి సంబంధించి గౌతమ్ దగ్గర గొప్ప గొప్ప ఆలోచనలు ఉన్నాయి. మొదటి భాగంతో పోలిస్తే రెండవ భాగంగా ఇంకా అద్భుతంగా ఉండబోతుందని వివరించాడు.

# దూసుకుపోతున్న సైయారా మూవీ

## సైలెంట్‌గా కలెక్షన్లు రాబడుతున్నట్లు వెల్లడి



అహన్ పాండే, అనీత్ పడ్డా జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్-టైనర్ 'సైయారా' మూవీ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఈ ప్రేమకథా చిత్రం ప్రస్తుతం మూడో వారంలోకి అడుగు పెట్టింది. శుక్రవారం 'సన్ ఆఫ్ సర్దార్ 2' , 'ధడక్ 2' విడుదలైనప్పటికీ 'సైయారా'కు ప్రేక్షకుల్లో ఆదరణ తగ్గలేదు. ఈ చిత్రం 15 రోజుల్లో దాదాపు రూ.284 కోట్లను రాబట్టింది. ఈ వారాంతానికి రూ.300 కోట్లు- వసూలు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. 'సైయారా' రెండో వారంలో 107.75 కోట్లను రాబట్టింది. బాలీవుడ్‌లో రెండో వారంలో అత్యధిక వసూళ్లు సాధించిన పదో చిత్రంగా నిలిచి రికార్డు సృష్టించింది. 'ది కశ్మీర్ ఫైల్స్' (రూ.108.97 కోట్లు-), 'దంగల్' (రూ.115.96 కోట్లు-), జవాన్ (రూ.125.46 కోట్లు-) చిత్రాలు 'సైయారా' కంటే ముందున్నాయి. మొదటివారంతో పోల్చుకుంటే.. రెండో వారంలో కలెక్షన్లు కాస్త తగ్గినప్పటికీ.. మూడోవారమూ విజయవంతంగా ప్రదర్శితమయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అజయ్‌దేవ్‌గణ్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2', సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్ర పోషించిన 'ధడక్ 2'కు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనే దక్కుతోంది. ఇది జులై 18న విడుదలైన 'సైయారా'కు కలిసివస్తోంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131